

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

వార్త

# శ్వాసపై ధ్యాసతో యోగా

## - యోగాను సాధన చేస్తే ఆసుపత్రులకు వెళ్ళనవసరం లేని ఆరోగ్యకర జీవితం - జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్



**నెల్లూరు కలెక్టరేట్, మే 20, ప్రభాతవార్త** జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ సన్నాహక ఏర్పాట్లలో భాగంగా మంగళవారం ఉదయం నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన మెగా యోగాసాధనలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన రాష్ట్రంలోని విశాఖకు వస్తున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా యోగ పై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రధాన కార్యదర్శుల ఆదేశాల మేరకు జిల్లాలో రాబోయే నెలరోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. యోగాను నిత్యం సాధన చేస్తే



ఆసుపత్రులకు వెళ్లవలసిన అవసరం తగ్గుతుందన్నారు. అందరి జీవితాల్లో యోగా భాగమవ్వాలన్నారు. రాబోయే నెల రోజుల్లో ప్రతి మండలంలో, ప్రతి గ్రామంలో యోగ కార్యక్రమాలు నిర్వహించాలని, వీలైనంత ఎక్కువమందికి అవగాహన కలిగించేందుకు కృషి చేయాలన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పున ప్రారంభించాక జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో యోగ సాధన పై అవగాహన కలిగించాలన్నారు. అదేవిధంగా రాబోయే నెల రోజులు ఒక ప్రణాళిక ప్రకారం షెడ్యూల్ తయారు చేసుకొని ప్రతి గ్రామంలో యోగ సాధన చేసేవిధంగా అవగాహన కలిగించాలన్నారు. ఈ సందర్భంగా యోగా గురువు స్వప్న ఆధ్వర్యంలో విద్యార్థులు, వాకర్ క్లబ్ సభ్యులు తదితరులతో కలిసి జిల్లా కలెక్టర్ యోగాసనాలు చేశారు. ప్రాణాయామం, నాడీ సాధన, భుజంగాసనం, శలభాసనం తదితర ఆసనాలను విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆనంద్ ఉత్సాహంగా చేశారు. చివరగా నయాగ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వకృత్వ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలైన చిన్నారులకు జిల్లా కలెక్టర్ మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డి ఎస్ డి ఓ యతిరాజ్, సెట్నెల్ సీఈవో నాగేశ్వరరావు, కార్యక్రమ నిర్వాహక ప్రతినిధులు విగ్నేష్, విజయ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నెల రోజులపాటు యోగా అవగాహన కార్యక్రమాలు నిర్వహణ

### - జిల్లా ప్రజలను భాగస్వామ్యులు చేయండి
### - జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులకు సూచన



**నెల్లూరు కలెక్టరేట్, మే 20, ప్రభాతవార్త** మంగళవారం సాయంత్రం అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ముందస్తుగా చేపట్టాల్సిన యోగా అవగాహన కార్యక్రమాలపై అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21న విశాఖపట్నంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొననున్న నేపథ్యంలో యోగా ప్రాధాన్యతను ప్రజలందరికీ తెలిసేలా జిల్లా వ్యాప్తంగా యోగా అవగాహన కార్యక్రమాలు నేటి నుంచి జూన్ 21 వరకు షెడ్యూలు ప్రకారం నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి, జడ్పీ సీఈవో, డిఎం అండ్ హెచ్వో, ఆయూష్ శాఖల అధికారులు 30 రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించేలా షెడ్యూలు తయారు చేయాలన్నారు. ఎంపీడీవోలు అందరూ మండల స్థాయిలో ఒక ప్రత్యేక యోగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. గ్రామపంచాయతీ స్థాయిలో కూడా స్థానిక ప్రజలకు యోగా ప్రాధాన్యతను వివరించాలన్నారు. జిల్లా స్థాయి అధికారులు అందరూ వారి శాఖల పరిధిలో సిబ్బందికి కూడా అవగాహన కల్పించేలా యోగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా, డివిజనల్, మండల స్థాయి అధికారులు అందరూ యోగా అవగాహన కార్యక్రమాల్లో తప్పకుండా పాల్గొనాలని కలెక్టర్ సూచించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో జిల్లాలో 30 రోజులపాటు యోగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని ప్రతి ఒక్కరిని కూడా కార్యక్రమాల్లో భాగస్వామ్యులు చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## అనధికార నిర్మాణాలకు నోటీసులు జారీ చేయండి

### - కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్,మే 20 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో అనధికారంగా నిర్మాణం అవుతున్న భవనాలకు నోటీసులు జారీ చేసి ఛార్జ్ సీట్ ఫైల్ చేయాలని కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక వనంతోపు, భక్తవత్సల నగర్, కరెంట్ ఆఫీస్ కూడలి తదితర ప్రాంతాలలో కమిషనర్ మంగళవారం పర్యటించారు. డివిజన్ పరిధిలో అవసరమైన ప్రాంతాల్లో నూతన డ్రైను కాలువల నిర్మాణం, సిసి రోడ్ల నిర్మాణానికి అంచనాలను సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను కమిషనర్ సూచించారు. రోడ్లను ఆక్రమిస్తూ ఎలాంటి నిర్మాణాలను చేపట్టవద్దని అనధికార నిర్మాణాలను తప్పనిసరిగా కూల్చివేస్తామని కమిషనర్ హెచ్చరించారు. డ్రైను కాలువలను ఆక్రమిస్తూ చేపట్టిన ర్యాంపులు, మెట్ల నిర్మాణాలను తొలగించి అవసరమైన చోట సిల్ట్ తొలగింపు పనులను చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు.

## టీడీపీ మహానాడు కీలక కమిటీల్లో సభ్యులుగా ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు రూరల్, మే 20, ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ 27 నుంచి కడపలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న మహానాడులో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌కి అధిష్టానం కీలక బాధ్యతలు అప్పగించింది. మంత్రి నారా లోకేష్ కన్వీనర్‌గా 12 మందితో కూడిన సమన్వయ కమిటీలో సభ్యులుగా ఎంపీ వేమిరెడ్డిని ఎన్నుకుంది. అలాగే ఆర్థిక వనరుల కమిటీ మెంబర్‌గా మరో కమిటీలో స్థానం కల్పించింది. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ అధిష్టానం మహానాడుకు సంబంధించిన వివిధ కమిటీలను ప్రకటించింది. మహానాడు అంతటినీ సమన్వయం చేసుకోవడం, మహానాడుకు ఆర్థిక వనరుల మద్దతు వంటి అంశాలను ఈ కమిటీలు చూస్తాయి.

# పండగ వాతావరణం లో మినీ మహానాడు

**❖ జిల్లా అభివృద్ధికి వేమిరెడ్డి కృషి మరువలేనిది ❖ వివాద అవినీతిరహిత కోవూరే నా ధ్యేయం ❖ ప్రజా సమస్యల పరిష్కారానికే రాజకీయాల్లోకి వచ్చాం**





**కోవూరు, మే 20 ప్రభాతవార్త :** ఒక పెద్ద పండగ వాతావరణం లో కోవూరు మినీ మహానాడు జరగడం తమకెంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తెలిపారు అదేవిధంగా కోవూరు నియోజవర్గంలోని ఐదు మండలాల్లో రానున్న మహానాడులోగా ఎన్టీఆర్ విగ్రహాలు ఏర్పాటు చేసేలా తన వంతు ప్రత్యేక దృష్టి పెడతానన్నారు కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఇన్చార్జిలుగా ఏర్పాటు చేసింది మీపై పెత్తనం చేసే దానికి కాదని కేవలం సమన్వయం కోసమే నని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు ఈ మినీ మహానాడు ను ఇంత విజయవంతం చేసిన కోవూరు నియోజకవర్గ నేతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అన్నారు.

**వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిమాట్లాడుతూ**



మొదటిసారిగా తాను ఈ మహానాడు కార్యక్రమంలో పాల్గొంటున్నా ను అన్నారు క్రమ శిక్షణ కలిగిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న చంద్రబాబు నాయుడు ఎన్నిసార్లు ఢిల్లీకి వచ్చిన ప్రతిసారి మంత్రులను కలిసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనించేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఈ విధంగా దృష్టి పెట్టిన దాఖలాలు లేవు గత ప్రభుత్వంలో 27 వేల కోట్లు నిధులు జల జీవన్ పథకం కిందమంజూరు అయితే కేవలం 2500 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు జల జీవనం మిషన్ పథకం కింద జిల్లాలోని ప్రతి ఇంటికి సురక్షిత మంచినీరు ఇవ్వాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయం కేంద్ర మంత్రులు ఎక్కువమంది ముఖ్యమంత్రి చంద్రబాబు దగ్గర నేర్చుకోవాలని చెప్పడం తనకెంతో ఆశ్చర్యం కలిగించిందన్నారు. సంవత్సరం లో దగదర్తి ఎయిర్ పోర్టుకు శ్రీకారం. దుగ్గరాజు పట్నంలో చేపట్టబోయే అనేక పరిశ్రమలు జిల్లాకు తలమానికం కాబోతున్నాయి తల్లికి వందనం జూన్ 12వ తేదీ ప్రారంభం కానుంది అన్నదాత సుఖీభవ జూన్ లోనే ప్రారంభం కానుంది మహిళలకు ఫ్రీ బస్ ఆగస్టులో ప్రారంభం కానుంది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం ఈ రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టం అన్నారు కోవూరు నియోజకవర్గానికి 200 కోట్లు ఈ సంవత్సరకాలంలో ఖర్చు పెట్టడం జరిగిందన్నారు ఇదితనకెంతోఆనందంగా ఉందన్నారు.

**ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ**



ప్రజలే దేవుళ్ళు సమాజమే దేవాలయం అనే నినాదం తెలుగుదేశం పార్టీలోనే పుట్టింది క్రమశిక్షణ కలిగిన ఏకైక పార్టీ తెలుగుదేశం కోవూరు నియోజక వర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోట ఈ ప్రజలందరికీ తాను జీవితాంతం రుణపడి ఉంటాను అన్నారు ఈ నియోజకవర్గంలో కార్యకర్త స్థాయి నుంచి నియోజకవర్గ నేత వరకు అందరూ క్రమశిక్షణ కలిగిన వారే జిల్లా పార్టీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు తీవ్రంగా కృషి చేశారన్నారు నాయకుడు ఎదగాలనుకునే వారు గ్రామస్థాయిలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేయాలి. సూపర్ సిక్స్ పథకాలకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు పింఛన్ల పెంపు గ్యాస్ సిలిండర్లు ఇవ్వడం విపిఆర్ ఫౌండేషన్ సహకారంతో నియోజకవర్గంలో మంచినీటిసమస్యలు లేకుండా చేస్తున్నాం. ప్రజా సమస్యల పరిష్కారానికే రాజకీయాలకు వచ్చామే తప్ప ప్రజలపై పెత్తనం చేయడానికి కాదు అవినీతి రహిత వివాద రహిత... కోవూరు నియోజకవర్గం. నా ధ్యేయం ఎన్నికలవరకే పార్టీలు ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం ప్రజలకు సేవ చేయడమే తప్ప దోచుకోవడం తమకు తెలియదు నిధులు తెచ్చి అభివృద్ధి చేయడమే తమ ప్రధాన కర్తవ్యం తమకు కుహనా రాజకీయాలు తెలియవు కేవలం ప్రజలకు సేవ చేయడమే తమ ధ్యేయం ప్రజలకు సేవ చేసే ప్రతి ఒక్కడు నాయకుడు. దోచుకోడానికి అనుమతి ఇచ్చే పరిస్థితి లేదు, గ్రావెల్ ఇసుక దోచుకునే వారికి అనుమతి ఇచ్చే పరిస్థితి లేదు, అటువంటి వారిని దూరంగా పెడతాను కష్ట కాలంలో పార్టీకి అండగా నిలబడిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను కొత్తగా బాధ్యత తీసుకున్న మండల పార్టీ అధ్యక్షులు పార్టీ అభివృద్ధి వైపు దృష్టి పెట్టాలి.

**జిల్లా పార్టీ అధ్యక్షులుఅబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ**

మినీ మహానాడు ఒక పండగ వాతావరణంలా ఉంది ఈ సంవత్సరంలో చేసిన అభివృద్ధి రానున్న సంవత్సరంలో ఏమి అభివృద్ధి చేయాలనేది చర్చించుకోవాలి చేసుకున్న తీర్మానాలను ప్రతి ఒక్కరూ ఆమోదించుకోవాలి కోవూరులో డబుల్ ఇంజన్ పాలన సాగుతుంది కొవూరు ప్రాంతంలో రాజకీయ అవగాహన ఎక్కువ ఎంపీ అయిన తర్వాత పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో వందకు పైగా వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు వికలాంగులకు ట్రై సైకిల్స్ ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేశారు యువత ఉపాధి కోసం అనేక ప్రయత్నాలు చేస్తున్నారు రామాయపట్నంలో ఆయిల్ కంపెనీలు తీసుకురావడంలో వేమిరెడ్డి కీలక పాత్ర పోషించారు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో చర్చించి కీలక పరిశ్రమలు జిల్లాకు రావడంలో ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారు ఎంపీ పదానికి పూర్తి స్థాయిలో సార్ధకత ఇస్తున్న ఏకైక వ్యక్తి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కార్యకర్తలకు నాయకులకు పూర్తి స్వేచ్ఛనిస్తున్న ఏకైక వ్యక్తులు వేమిరెడ్డి దంపతులు ఖజానా ఖాళీ చేసి చిప్ప పెట్టి పోయాడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమ వైపు పరుగులు తీస్తున్నాడు తొందర్లో సూపర్ సిక్స్ అమలుకు శ్రీకారం చుట్టపోతున్నారు. సమాజం పట్ల బాధ్యత తప్పనిసరి. సంతోషంతో పనిచేసినప్పుడే సంతృప్తి వస్తుంది కార్యకర్తలు త్యాగాలు మరువలేనివి.



## కోవూరు మినీ మహానాడులో 9 తీర్మానాలు

కోవూరులోని పివిఆర్ కళ్యాణమండపంలో మంగళవారం రాత్రి కోవూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీమినీ మహానాడులో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి 9 తీర్మానాలను వివిధ గ్రామాల నాయకులు చేత ప్రతిపాదించారు ఈ తీర్మానాలను మినీ మహానాడులో పాల్గొన్న నాయకులు కార్యకర్తలు ఆమోదం తెలిపారు

1. మైపాడు రామతీర్థం బీచ్ల అభివృద్ధికి తీర్మానం
2. కోవూరు మున్సిపాలిటీగా చేయాలనే ప్రతిపాదన
3. ముదివర్తి పాలెం కాజ్వే నిర్మాణాలను వేగవంతం చేయాలి
4. కిసాన్ సెజ్ లో ఉపాధి కల్పన పరిశ్రమలు ఏర్పాటు
5. పెన్నా పరివాహక ప్రాంతంలో రిటైనింగ్ వాల్ ఏర్పాటు
6. కొడవలూరు మండలంలో మితాని అల్యూమినియం పరిశ్రమ ఏర్పాటుకు ప్రతిపాదన
7. విజన్ 2047 ప్రతిపాదన
8. కనిగిరి రిజర్వాయర్ అభివృద్ధి ఆ ప్రాంతంలో టూరిజం ఏర్పాటుకు
9. కోవూరు నియోజకవర్గ పరిధిలోని ప్రతి మండలంలో రెండు గ్రామాలు సూర్య పథకం కింద ఎంపిక

## దాతల సౌజన్యంతో పాఠశాలల్లో అధునాతన సౌకర్యాలు



**నెల్లూరు కార్పొరేషన్,మే 20 ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలోని వివిధ మున్సిపల్ పాఠశాలల్లో దాతల సౌజన్యంతో అధునాతన వసతులను కల్పించేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని కమిషనర్ వై.ఓ నందన్ అధికారులకు సూచించారు. మున్సిపల్ పాఠశాలల ఆధునీకరణ పనుల్లో భాగంగా కమిషనర్ మంగళవారం స్థానిక వి.ఆర్ విద్యాసంస్థల ప్రాంగణం, మూలాపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలకు అవసరమైన అన్ని అధునాతన వసతులు, అదనపు నూతన ఇన్ఫ్రాస్ట్రక్చర్ ను ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలలకు కావలసిన అన్ని ఆధునిక ఏర్పాట్లను డి.ఎస్.ఆర్ సంస్థ ద్వారా సమకూరుస్తామని చైర్మన్ దేవిరెడ్డి సుధాకర్ రెడ్డి కమిషనర్ కు తెలియజేశారు.






## శ్రీపంచముఖ ఆంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ప్రారంభం



**వింజమూరు, మే 20, ప్రభాతవార్త :** వింజమూరులోనే హనుమాన్ నగర్ బట్టువారిపాలెం గ్రామ రహదారి ప్రక్కన నిర్మాణం చేసిన శ్రీ పంచ ముఖ ఆంజనేయస్వామి వారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆలయ నిర్వాహకులు జి.శ్రీహరిరెడ్డి రత్నకుమారి దంపతులు ఆధ్వర్యంలో వేద పండితులు పర్యవేక్షణలో ఉదయాన్నే ఆలయ శుద్ది గణపతి పూజ పుణ్యాహ వచనం షోడశోపచారములు తదితర పూజా కార్యక్రమాలను జరిపించారు. సాయంత్రం గణపతి హోమం తదితర హోమాధులను జరిపించారు. భక్తులు హాజరై స్వామివారి కార్యక్రమాలలో పాల్గొని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పరిసర గ్రామాల భక్తులు హాజరయ్యారు.

## కనీస వేతనం వచ్చేలా పనులు చేయాలి



**వింజమూరు, మే20, ప్రభాతవార్త :** ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసే కూలీలు కనీస వేతనాలు వచ్చేలా పనులు చేయాలని ఏపీవో సుభాషిణి తెలిపారు. మంగళవారం ఊటుకూరు, జువిగంట పాలెం గ్రామాలలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి పనులను పరిశీలించారు. ఫారం పాండ్స్ నీటి కుంటలు, పశువులకు నీరు తాగేందుకు అవసరమై కుంటలు ఏర్పాటు చేస్తున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలను ఉద్దేశించి మాట్లాడుతూ సకాలంలో పనులకు వచ్చి నిర్దేశించిన కొలతలు ప్రకారం పనులు చేయాలన్నారు. అప్పుడే పనికి తగిన కూలి వస్తుందని ఆమె తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున నేల తేమగా ఉందని పనులు చేయడానికి సులువుగా ఉంటుందన్నారు. కాబట్టి కూలీలు ఇచ్చిన కొలతలు ప్రకారం ముగించుకుని తగిన వేతనాన్ని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు ఫీల్డ్ సహాయకులు మల్లేశ్వరి ఉన్నారు.

## వెంకటగిరిలో మిని మహానాడుకు తరలిరండి



**రాపూరు,మే20ప్రభాతవార్త :** 22వ తేది గురువారం ఉదయం వెంకటగిరిలోని పింజిలి వీరయ్య కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్యక్షతన నిర్వహించే తెలుగుదేశం పార్టీ మినీ మహానాడుకు రాపూరు మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని పెంచలకోన దేవస్థానం మాజీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి మంగళవారం కోరారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్యక్షతన నిర్వహించే ఈ నియోజకవర్గ స్థాయి మహానాడుకు ముఖ్య అతిధిగా తిరుపతిజిల్లా తెలుగుదేశం పార్టీ ఆధ్యక్షుడు గోల్ల నరసింహ యాదవ్ హజరైతారనీ, వీరితో పాటు జిల్లాలోని పలువురు పార్టీ పెద్దలు,నియోజకవర్గంలోని తెలుగుదేశం ముఖ్య నాయకులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిదులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కమిటీ నాయకులు హాజరైతారన్నారు. రాపూరు మండలం నుండి పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ మినీమహానాడుకు హజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## అరుణాచలం గిరి ప్రదక్షిణకు రాపూరు నుండి ఆర్టీసి బస్సు

**రాపూరు,మే20ప్రభాతవార్త :** అరుణాచలం గిరి ప్రదక్షణంకు వెళ్ళే భక్తుల సౌకర్యార్ధం రాపూరు ఆర్టీసీ నుండి బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ అనీల్ కుమార్ మంగళవారం తెలిపారు. జూన్ నెల 10వ తేది ఈ బస్సు పోదలకూరు నుండి బయలు దేరి రాపూరు,డక్కిలి, వెంకటగిరిల మీదుగా ప్రయాణి స్తుందన్నారు. ఈ బస్సు సిరిపురం గోల్డన్ టెంపుల్, అరుణాచలం దేవస్థానమునకు స్పెషల్ టూర్ ఫ్యాకెజిగా ఏర్పాటు చేసామన్నారు. ఈ అవకాశాన్ని కలువాయి, రాపూరు,చేజర్ల, పోదలకూరు, డక్కిలి మండలాల భక్తులు వినియోగించుకోవాలన్నారు. ఈ బస్సుకు టిక్కెట్ ధర రూ.1300 అని, రిజర్వేషన్ కోరకు మరిన్ని వివారాలకు సెల్ నెం:6303036216 లో సంప్రదించాలని కోరారు.

## జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించిన కావలి ఎమ్మెల్యే



**కావలి, మే 20 ప్రభాతవార్త :** కావలి పట్టణ ఎంయస్ఆర్ డిగ్రీ కళాశాలలో జరగనున్న జాబ్‌మేళా పోస్టర్‌ను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో ఆయన ఈ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎపియస్‌యస్‌డిసి ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేది కావలి ఎంయస్ఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. 23 కంపెనీలు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటున్నాయని తెలిపారు. దాదాపు 1200 మందిని నియమించడం జరుగుతుందన్నారు. కావలి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువకులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ జాబ్‌మేళాలో పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, డిప్లొమా, పాలిటెక్నిక్, బిఫార్మసి చేసిన నిరుద్యోగ యువతీయువకులు పాల్గొనవచ్చునని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంయస్ఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్, టిడిపి లీగల్‌సెల్ కావలి నియోజకవర్గ కన్వీనర్ గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, నైపుణ్యాభివృద్ధిసంస్థ జిల్లా ఇన్‌చార్జి అబ్దుల్ ఖయ్యూమ్, తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంతి ఉద్యోగుల వినతి



**ఉదయగిరి, మే20, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలోని మంగళవారం తమ సమస్యల పరిష్కారం కొరకు సబ్ ట్రెజరీ ఆఫీసు ఉదయగిరికి వచ్చే విశ్రాంత ఉద్యోగులు పైకి మెట్టు ఎక్కి పోవాలంటే చాలా ఇబ్బందిగా ఉంది కాబట్టి సబ్ ట్రెజరీ ఆఫీస్ క్రింద ఉన్న హాల్లో ఒక కంప్యూటర్ ఒక ఉద్యోగిని పెట్టి విశ్రాంతి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కొరకు కృషి చేయాల్సిందిగా రిటైర్డ్ ఉద్యోగుల తరుపున రిప్రజెంటేషన్ చేయడం జరిగింది. అలాగే సబ్ ట్రెజరీ లో ఉన్న ఉద్యోగుల కొరతను గురించి పై అధికారులకు ప్రభుత్వానికి తెలియజేసి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాల్సిందిగా అర్జీని సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు గాజులపల్లి రామిరెడ్డి, షేక్ జాఫర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## బండగానిపల్లి సమీపంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు



**ఉదయగిరి, మే20, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి మండలం బండగానిపల్లి ఘాట్ రోడ్ సమీపంలో వెయ్యి మెట్ల మార్గం వద్ద గుప్త నిధుల తవ్వకాల ముఠా కూలీలు చాకచక్యంగా అటవీ శాఖ అధికారులు సోమవారం రాత్రి సమయంలో అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు వ్యక్తులను వెంబడించగా ఇద్దరు పరారవ్వగా ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వ్యక్తి వరికుంటపాడు మండలం తూర్పు బోయమడుగులకు చెందిన నల్లు అశోక్‌గా గుర్తించడం జరిగింది. ఈ ఘటనపై అటవీశాఖ అధికాలు విచారణ చేపట్టారు.

## నియోజకవర్గంలోని రాజకీయ నాయకులతో స్పెషల్ కలెక్టర్ సమీక్ష సమావేశం



**ఉదయగిరి, మే20, ప్రభాతవార్త :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఉదయగిరి తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, పీఏ టూ స్పెషల్ కలెక్టర్ టీజీపీ నెల్లూరు ఏ.మురళి పొలిటికల్ లీడర్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, డబల్ ఎంట్రీలు వివరాలు తెలియపరచాలని కోరారు.ఉదయగిరి నియోజకవర్గంలోని తహశీల్దార్లతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి తహశీల్దార్ నియోజకవర్గంలోని రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పురిణి చెరువులో ఆక్రమణలకు గురైన భూములను పరిశీలించిన ఆర్డీవో



**అల్లూరు,మే 20,ప్రభాతవార్త:** అల్లూరు మండల పరిధిలోని పురిణి చెరువులో ఆక్రమణలకు గురైన భూములను కావలి ఆర్డీవో వంశీకృష్ణ పరిశీలించారు పురిణి గ్రామములో ఎల్పీఎం నెంబర్ 1391 విస్తీర్ణం విస్తీర్ణం 500 ఎకరాల 11 సెంట్లు లో చెరువు ఆక్రమణలో ఉన్న కొంత మందిని ఆక్రమణ నుంచి తొలగించిన విషయంపై సోమవారం పీజీఆర్ఎస్ లో కొంతమంది అర్జీ ఇవ్వగా మంగళవారం నాడు ఆక్రమణలకు గురైన పురిణి చెరువు భూములను పరిశీలించేందుకు అల్లూరు మండల్ తాసిల్దార్ మండల సర్వేర్ మరియు రెవెన్యూ సిబ్బందితో కలిసి భూములు పరిశీలించి ఆక్రమణదారులు మరియు గోగులపల్లి ఆయకట్టు దారుల రైతులతో మాట్లాడారు అనంతరం నీటిపారుదలకు ఇరిగేషన్ వారితో సమన్వయము చేసుకొని ఇబ్బందులు రాకుండా చూస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పురిణి. గోగుల పల్లి గ్రామాల్లోని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## నీలం మల్లికార్జున యాదవ్‌ను సన్మానించిన అధికారులు



**ముత్తుకూరు, మే 20, ప్రభాతవార్త :** ముత్తుకూరు మండలాధ్యక్షుడుగా పదవి బాధ్యతలు చేపట్టిన నీలం మల్లికార్జున యాదవ్‌ను పలువురు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాన్ని అందజేసి సన్మానించారు. మండలాధ్యక్షుడును సన్మానించిన వారిలో ఈఓపిఆర్‌డి హేమంత్, సూపరింటెండెంట్ శివభాస్కర్ రావు, బ్రహ్మదేవం పంచాయితీ కార్యదర్శి లెనిన్, జూనియర్ అసిస్టెంట్ హర్ష తదితరులు ఉన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి



**ముత్తుకూరు, మే 20, ప్రభాతవార్త :** పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, అందరినీ కలుపుకొని పోతానని మండలాధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కార్యకర్తలు, నాయకులకు ఎటువంటి సమస్యలొచ్చినా తన దృష్టికి తీసుకొచ్చినా సమస్యను పరిష్కరిస్తానని అన్నారు. టిడిపి నాయకులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తనను నమ్మి ఈ పదవి ఇచ్చిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ పదవి రావడంతో మరెన్ని బాధ్యతలు పెరిగాయని అన్నారు. కార్యకర్తలే పార్టీకి మూలస్థంబాలని అందరూ కలిసికట్టుగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పిలుపునిచ్చారు. అనంతరం హెల్పింగ్ హాండ్స్ సొసైటీ అధ్యక్షులు చెంచాల విజయ భాస్కర్, శివాజీ ఫౌండేషన్ అధినేత మోపూరి భాస్కర్ నాయుడు, హరిహరాదుల సేవా సమితి పాండు, ఆల్తూరు ఆదిశేషయ్య పౌండేషన్ మస్తానయ్యలు మండలాధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అక్కయ్యగారి ఏడుకొండలు, శంకర్, ఎల్లయ్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పనిభారం తగ్గించాలి - తహాశీల్దార్‌కు వినతి

**ముత్తుకూరు, మే 20, ప్రభాతవార్త :** గ్రామ రెవెన్యూ అధికారులుగా పనిచేస్తున్న వీఆర్‌ఓలకు పని భారం తగ్గించాలని తహాశీల్దార్ స్వప్నకు వీఆర్‌ఓలు మంగళవారం వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం సచివాలయాల రేషనలైజేషన్ ప్రక్రియలో ఇచ్చిన జీఓఎంఎస్ నెంబర్ 4 వలన మా యొక్క కేడర్‌కు, ప్రమోషన్ చానల్‌కు, మిగిలిన సిబ్బందిగా వీఆర్‌ఓలను నియమించుట, మిగిలిన సిబ్బందిగా కాకుండా ఉన్న వీఆర్‌ఓలకు విపరీతమైన పనిఒత్తిడి గురయ్యే ప్రమాదం ఉంటుందని గుర్తించాలని తెఇపారు. రేషనలైజేషన్ క్లస్టర్ విధానంలో జరుగుతున్న లోపాలను గుర్తించి ఎన్నో సార్లు ప్రభుత్వ అధికారులకు, ఉన్నతాధికారులు విన్నవించామని తెలిపారు. కానీ ప్రభుత్వం జీఓఎంఎస్ నెంబర్ 4 విడదలచేసి ఉన్నందున తాము తీవ్ర ఆందోళనకు గురౌతున్నామన్నారు. అందువల్ల రాష్ట్ర, జిల్లా సంఘం ఏ విధమైన ఆదేశాలు ఇచ్చిన, వారు ఏ రకమైన కార్యక్రమాలు చేయమని ఆదేశించినా అందరూ ఒకే తాటిపై ఉండి పోరాడుతామని అన్నారు.

## కరెంటు స్తంభం కూలడంతో వ్యక్తి మృతి



**కావలి, మే20 ప్రభాతవార్త :** కావలి పట్టణ ఉదయగిరి రోడ్డులో కరెంటుస్తంభం కూలడంతో మద్దెల వెంకటేష్(32) మంగళవారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయగిరి రోడ్డులో సుబ్బారావు చికెన్‌పకోడి బండికి నీడ కల్పించేందుకు ఆయన స్నేహితుడు మద్దెల వెంకటేష్ అక్కడికి వెళ్లాడు. అక్కడ ఉన్న కరెంటు స్తంభానికి పట్ట కడుతుండగా సపోర్ట్‌గా ఉన్న మరోస్తంభం వెంకటేష్‌పై కూలిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కావలి బాలకృష్ణారెడ్డినగర్‌కు చెందిన బైక్ మెకానిక్ మద్దెల వెంకటేష్‌కు భార్య మౌనిక, కూతురు, కొడుకు ఉన్నారు. దీంతో ఈ పేద కుటుంబం రోడ్డున పడింది. ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. సంఘటన ప్రదేశాన్ని టూటౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గిరిబాబు, పోలీసులు సందర్శించారు. టిడిపి నేతలు కూడా పాల్గొన్నారు.

## రెండో పంట సాగుకోసం నీరు విడుదల



**కలువాయి మే 20 ప్రభాతవార్త :** కలువాయి చెరువు వద్ద దక్షిణ కాలువ గేటు నుండి రెండోవ పంట సాగుకోసం మంగళవారం సోమశిల ప్రాజక్టు చైర్మన్ఏలూరు కేశవ చౌదరి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మల్లికార్జున్, కూటమి నాయకులు నీటిని విడుదల చేశారు.సాంప్రదాయ బద్దంగా గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించి నీటిని విడుదల చేశారు.ఈ సందర్భంగా కేశవ్ చౌదరి మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం రైతు ప్రభుత్వంగా పనిచేస్తుందని అన్నారు. మొదటి పంట పూర్తి అయిన ఒక్క నెల వ్యవధిలోనే రెండో వ పంటకు నీరు అందించడం శుభపరిణామమని అన్నారు. గత ప్రభుత్వంలో నీటి సంఘాలను రైతుల సంస్థలను నిర్వీర్యం చేసిన ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యం వహించందని ప్రస్తుత ప్రభుత్వం మరలా నీటి సంఘాలను ఏర్పాటు చేసి రైతులకు ఆసాగా నిలిచిందని రైతు హక్కులను కాపాడడంలో వారికి అవసరమైన వనరులు అందించడంలో ప్రభుత్వం ఎప్పుడు ముందు వుంటుందని ఆయన పేర్కున్నారు. కలువాయి చేజర్ల,పొదలకూరు, సంబందించిన ప్రాంతాల రైతంగానికి 35 వేల ఏకరాలకు నీరు అందించడం జరుగుతుందని వారు తెలిపారు.ఈకార్యక్రమంలో కలువాయి ,తెలుగురాయిపురం,నీటి సంఘం అధ్యక్షులు చల్లా విజయ్‌బాస్కర్‌రెడ్డి, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి నాయకులు,చల్లా రఘురామిరెడ్డి,కిషోర్‌రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కాలువలోకి దూసుకెళ్ళిన కారు తృటిలో తప్పిన ప్రమాదం





**బుచ్చి మే 20 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం బైపాస్‌రోడ్డులో ఒకారు అదుపు తప్పి గోడను ఢీకొని కాలువలో పడిపోయింది.కారు అదుపు తప్పి ఇంటి ప్రహారి గోడను ఢీకొని కాలువలో బోల్తా పడింది. ఇంటి యజమాని వృద్దురాలు శైలమ్మ తెలిపిన వివరాల మేరకు సోమవారం రాత్రి తాను ఇంటి వరండాలో నిద్రిస్తుండగా కారు వేగంగా వచ్చి ప్రహారి గోడను ఢీకొని కాలువలో పడిందని చెప్పారు. కారు ఢీకొనడంతో చేతి పంపుతోపాటు ప్రహారి గోడ దెబ్బతినింది. ప్రహారి గోడ రాళ్ళు పైన బడడంతో భయాందోళనకు గురి అయినట్లు ఆమె తెలిపారు.ఈ సంఘటనలో ఎవ్వరికి ప్రమాదం జరగకపోవడంతో స్దానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఘటనా స్దలాన్ని పరిశీలించిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పడుగుపాడు పంచాయితీ కార్యదర్శి సస్పెండ్

**కోవూరు మే 20 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు పంచాయితీ కార్యదర్శిగా పనిచేస్తున్న బి హజరత్‌బాబును సస్పెండ్ చేస్తు పంచాయితీ రాజ్ కమీషనర్ వి.ఆర్ కృష్ణతేజా, నుంచి మంగళవారం జిల్లా పంచాయితీ కార్యాలయానికి ఆదేశాలు వచ్చాయి.ప్రదానంగా విధులు వినియోగంలో 25 లక్షల 51 వెయ్యి 810 రూపాయాలు దుర్వినియోగం అయిన విషయంలో ఈ సస్పెండ్ జరిగింది. సోంతంగా బ్యాంకు ఖాతాలు ఏర్పాటు చేసుకోని నిధులు దుర్వినియోగానికి పాలుపడినట్లు డిఎల్‌పి విచారణలో తేలింది.ఈ మేరకు సెక్రటరీని సస్పెండ్ చేస్తు ఆదేశాలు రావడం జిల్లా వ్యాప్తంగా నిధుల దోచుకున్న కార్యదర్శలలో భయాందోళన పెరిగింది.

## లింగవివక్షతపై అవగాహన అవసరం



**ఆత్మకూరు,మే20,ప్రభాతవార్త:** మండలంలోని దేవూ రు మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం లింగ వివక్ష త-అసమానతలపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈకార్యక్రమానికి సూపర్‌వైజర్ నాగేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడు తూ తల్లిదండ్రులు లింగవివక్షత-అసమానతలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆడపిల్లను ఒకలాగా, మగపిల్లలను ఒకలాగా చూడరాదన్నారు. దానివలన ఆడపిల్లలు అన్ని రంగాల్లో వెనుకబడతారన్నారు. కావున తల్లిదండ్రులు ఆడపిల్ల అయినా, మగపిల్లలయినా ఒకటే అనే భావంలోకి వస్తే ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందంజలో ఉంటారన్నారు. తల్లిదండ్రులను అన్ని విషయాల్లో వారికి తోడ్పాటును అందిం చాలన్నారు. అలా చేసినప్పుడే ఆడపిల్లలు అన్ని రంగాల్లో విజయం సాధిస్తారన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటసుబ్బమ్మ, అంకమ్మ, హెల్పర్లు, కిశోరబాలికలు , మహిళలుపాల్గొన్నారు.

## నిర్మూలనపై అవగాహనా సదస్సు



**అనంతసాగరం,మే20,ప్రభాతవార్త:** మండలంలోని బొమ్మవరం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోరవికా సం-వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా లింగవివ క్షత-అసమానతలుపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈకార్యక్రమానికి డాక్టర్ అశోక్ , డాక్టర్ నాగేంద్రలు హాజరయ్యారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడ ఆడ,మగ అనే బేధం లేకుండా అందరూ సమానమే భావం తల్లిదండ్రుల్లో, యువతలో రావాలన్నారు. ఈ లింగవివక్షత వలన ఆడపిల్లలు మానసికంగా తల్లడిల్లిపోతున్నారని, ప్రస్తుతం కొంత మార్పు వచ్చిందని కానీ ఇంకా తల్లిదండ్రుల్లో ఆడ,మగ అనే తేడాలు, అసమానతలను తొలగించుకోవాలని ఆయన కోరారు. ఈ విషయాలపట్ల తల్లిదండ్రులందరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శారదమ్మ ,అంగన్‌వాడీ కార్యకర్త కె.జ్యోతి, ఆశవర్కర్లు వసంత,సుశీలమ్మ, హెల్పర్ సునీత, కిశోరబాలికలు, మహిళలు పాల్గొన్నారు.

## లింగవివక్షత-అసమానతలపై అవగాహనా సదస్సు



**అనుమసముద్రంపేట,మే20,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఏఎస్‌పేటలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో లింగవివక్షతపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఏఎం పేట సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల అసమానతలను చూపరాదని, ఆడపిల్ల, మగపిల్లవాడు అనే బేధం చూపరాదని అలాంటి విషయాలను తెలుసుకొని ఆడపిల్లల అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. ఆడపిల్లలు అన్ని పట్టుదలతో అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాలపై అవగాహన కలిగి ఉండాలని తమబిడ్డల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్నారు.అంగన్‌వాడీ కార్యకర్తలు కె.విజయ లక్ష్మి, పి.సావిత్రి, షేక్ షాకీరాబేగం, జి.ఇందిర, కె.కృష్ణకుమారి, ఎం.సుశీలమ్మ , కిశోరబాలికలు పాల్గొన్నారు.

## లింగవివక్షత-అసమానతలపై అవగాహన అవసరం



**ఆత్మకూరు,మే20,ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలంలోని బి.చిరువెళ్ళ మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోరవికాసం-శిక్షణా తరగ తుల్లో భాగంగా లింగవివక్షత-అసమానతలపై అవగా హనా సదస్సును నిర్వహించారు. ఈకార ్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి పి.సునీలత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో లింగవివక్షత ఉందని ఈ విషయమై ప్రభుత్వం కిశోర బాలికలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఈకార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలను ఒకలాగా, మగపిల్లలను ఒకలాగా చూడడం వలన సమాజంలో ఆడపిల్లలకు అవమానాలు, అసమానతలు పెరిగిపోతున్నాయన్నారు. దీనివలన వారు విద్యలో, ఆహారంలో , ముందంజ వేయడంలో వెనుక బడిపోతున్నారన్నారు. అందువలన ఆడపిల్ల అయినా, మగపిల్లవాడయినా సమానమని వారిపట్ల మొదటగా తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలన్నారు. దీనివలన ఆడపిల్లలు ముందడుగు వేయగలరన్నారు. ప్రస్తుత కాలంలో నారు నాటడం నుండి విమానాలను నడిపే వరకు ఆడపిల్లలు తమ సామర్థ్యంతో పనిచేస్తున్నారన్నారు. అన్ని రంగాల్లోను వ్యవసాయం, విద్య, వైద్యం, ఆహారం అన్ని విషయాల్లో ఆడపిల్లలకు చేయూతనందించాలన్నారు. అప్పుడే సమాజం ముందడుగు లో ఉంటుందన్నారు. ఆడపిల్లలకు తల్లిదండ్రులు , సమాజం భరోసానిస్తే ఆర్థికంగా, సమాజపరంగా ఎన్నో విజయాలను సాధిస్తు ందన్నారు. అనంతరం కిశోరబాలికలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో వాసిలి సెక్టార్ సూపర్‌వైజర్ నారాయణమ్మ, ఎంఎస్‌కె జ్యోత్స్న, అంగన్‌వాడీ కార్యకర్తలు దేవసేనమ్మ,కృష్ణకుమారి, దొరసానమ్మ, కిశోరబాలికలు, మహిళలు పాల్గొన్నారు.

## కిశోర వికాసంపై అవగాహన సదస్సు



**ఉదయగిరి, మే20, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని కొండాయపాలెం మినీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోర వికాసంపై సూపర్‌వైజర్ షాను అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికల చట్టాలు, బాల్య వివాహాలు, గుడ్ టచ్ బాడ్ టచ్‌పై వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కిశోరి బాలికలు ఎదుగుదల సమయంలో పలు సమస్యలు ఉత్పన్నమవుతాయని వాటిని అధిగమించేందుకు మంచి ఆహారం తీసుకోవాలనిసూచించారు. అలాగే బిడ్డ బరువులు ఎత్తులను సమానత్వకాలతో చేయాలని ఆడ పిల్లలు మగ పిల్లలు ఇద్దరు సమానమేనని ఆమె అన్నారు. గర్భవతులకు, బాలింతలకు సరైన సమయంలో పౌష్టికాహారాన్ని అందిస్తున్నారా లేదా అంశాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ షాను, మహిళా పోలీసు నాగవనిత, అంగన్‌వాడీ కార్యకర్త జయలక్ష్మి, లబ్ధిదారులు, గర్భవతులు, బాలింతలు కిశోర బాలికలు, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కాలనీల కొరకు బండగానిపల్లి కార్యదర్శికి వినతిపత్రం అందజేత



**ఉదయగిరి, మే20, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని బండగానిపల్లి సచివాలయం పరిధిలోని పంచాయతీ కార్యదర్శి చిన్నకు కాలనీల కొరకు వినతి పత్రం రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య ఆధ్వర్యంలో మంగళవారం అందజేత. ఈ సందర్భంగా మాట్లాడుతూ బనగానపల్లి పంచాయతీలో కొత్తపల్లి గ్రామం నందు ఎస్సీ, ఎస్టీలు కొంత మంది పొజిషన్ సర్టిఫికేట్లు కలిగి ఉన్నారు. కొంత మందికి స్థలాలు లేవు, కావున అందరికి స్థలాలు ఇప్పించి కాలనీలో మంజూరు చేయుదురని బనగానపల్లి సచివాలయం కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య, సచివాలయ సిబ్బంది, సీపీఎం నాయకులు రైతు సంఘం నాయకులు బనగానపల్లి ఎంపీటీసీ కాకు విజయ తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరులో తిరంగా ర్యాలీ




**అల్లూరు,మే 20,ప్రభాతవార్త:** అల్లూరులో భారతీయ జనతా పార్టీ. ఆర్ఎస్ఎస్. జనసేన ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని మంగళవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు దేవళ్ళ హరి ప్రసాద్ రెడ్డి. కత్తుల కిరణ్ నాయుడు. సిద్ధ రమణయ్య. కత్తుల విజయ్ కుమార్. తదితరులు మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ లో భాగంగా ఉగ్రవాదులకు భారత్ సైన్యం ధీటైన సమాధానం ఇచ్చిందని భారత సైన్యానికి సెల్యూట్ చేస్తూ బిజెపి. ఆర్ఎస్ఎస్. జనసేన శ్రేణులు. యువత ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారు అనంతరం అలూరుపేటలోని అల్లంపాటి విజయవర్ధన్ రెడ్డి నివాసం నుండి కోనేరు పుష్కరిణి వరకు జాతీయ జెండాలను చేత పట్టుకొని భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు

## కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువ వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు




**సంగం మే 20 ప్రభాతవార్త :** కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువ వద్ద హెచ్చరిక బోర్డులను సిఐ వేమారెడ్డి,ఎస్ఐ రాజేష్ ఏర్పాటు చేశారు.వేసవి లో పిల్లలు ఈత సరదాలతో కాలువలో దిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని అందు వల్ల హెచ్చ రిక బోర్డులుఏర్పాటు చేసినట్లు తెలిపారుజ తల్లిదండ్రులు తమ పిల్లలు కాలువల వద్దకు వెళ్ళకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వారు కోరారు.

## ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి వడి వడిగా అడుగులు

**బిట్రగుంట మే 20 ప్రభాతవార్త:** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బిట్రగుంట ఎల్సి గేట్ 144 వద్ద ట్రాఫిక్ కష్టాలకు త్వరలో తెరపాడేఅవకాశాలుకు వడివడి గా అడుగులు ముందుకు పడుతున్నాయి. ఏళ్ళతరబడి మంజూరు అయిన ఈ బ్రిడ్జి నిర్మాణానికి ఎన్నో అవరోదాలు ఏర్పడ్డాయి. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత నెల్లూరు ఎం.పి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, రాజ్యసభసభ్యులు బీద మస్తాన్ రావు, కావలి ఎంఎల్ఏ దగుమాటి వెంకటకృష్ణారెడ్డి కేంద్రప్రభుత్వం పైన రైల్వే ఉన్నతఅధికారులు పైన వత్తిడి తెచ్చి కార్యరూపం దాల్చేలా కృషిచేసారు. అందులో భాగంగా మంగళవారం గతిశక్తి అధికారులు ఫైనల్ గా బిట్రగుంట లో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కొలతలు తీసుకోవడంతో ఇక నిర్మాణానికి అడ్డంకులు తొలగినట్లేనని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో నిర్మాణపనులు వేగవంతం కానున్నాయి.

## టంగుటూరి ప్రకాశం పంతులు 68 వర్ధంతి



**కొడవలూరు, మే 20, ప్రభాతవార్త:** మండల కేంద్రం లో ఉన్న గ్రంథాలయంలో ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్య మంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 68వ వర్ధంతి వేడుకలు గ్రంథాలయాల లైబ్రేరియన్ రాజేశ్వరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అందజేసిన తొలి ముఖ్య మంత్రి సేవలు మరువలేనివని కొనియాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## కిషోరి బాలికలకు అవగాహన కార్యక్రమం



**కొడవలూరు, మే 20, ప్రభాతవార్త :** మండలం నీలగిరి సంఘం ఎస్టీ కాలనీలో కిషోరి బాలికలకు 6వ వేసవి వికాస కార్యక్రమం ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎస్.నిర్మల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ కిషోరి బాలికలు 18 సంవత్సరాల వరకు వివాహాలు చేసుకోరాదని తల్లులకు వివరించారు. పౌష్టిక ఆహారం తప్పనిసరిగా తీసుకోవాలి తద్వారా ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ జ్ఞాన, ప్రసన్న, అంగ న్వాడి కార్యకర్తలు శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో వివాహిత మృతి

**తోటపల్లిగూడూరు, మే 20, ప్రభాతవార్త :** తోటపల్లిగూడూరు మండలంలోని కోడూరు పంచాయతీలోని మహాలక్ష్మీపురం సమీపంలో ఉన్న మిక్స్ కాలనీలో కుటుంబ కలహాల కారణంగా విల్లపు సుబ్బమ్మ అను వివాహిత మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. రమేష్ సుబ్బమ్మలకు 20 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరి కాపురం అన్యోన్యంగా సాగిపోతూ ఉండేది. వీరి అన్యోన్య జీవితంలో వీరికి ఒక బాబు కూడా జన్మించాడు. ఆ బాబు వయసు ఇప్పుడు 15 సంవత్సరాలు అయితే మృతి చెందిన సుబ్బమ్మ భర్త రమేష్ గతంలో ఆటో నడిపి కుటుంబాన్ని పోషిస్తూ వచ్చాడు. అలాగే సుబ్బమ్మ కూడా ఏదో ఒక పని చేసుకుంటూ ఇద్దరు సంపాదించిన డబ్బులతో కుటుంబం సజావుగా సాగిపోతూ వచ్చింది. ఇటీవల రమేష్ ఆటోలో వచ్చే సంపాదన సరిపోక వరి కోత మిషన్‌కు పోవడం ప్రారంభించాడు. అయితే ఇటీవ రమేష్ వరి కోత మిషన్‌కి వెళ్తూ భార్య సుబ్బమ్మ చేతికి రూ.30వేల రూపాయలు ఇచ్చి రూ.20వేల రూపాయలు ఆటోకు డివ్ కట్టాలి. రూ.20వేలు కట్టి పది వేల రూపాయలు నేను వచ్చే వరకు వాడుకో అని ఇచ్చి వెళ్లినట్లు మృతుని భర్త రమేష్ తెలిపారు. అయితే రమేష్ భార్య సుబ్బమ్మ ఇచ్చిన రూ.30వేల రూపాయలు తాను గతంలో తెచ్చుకున్న బంగారానికి కట్టానని ఇకన నా దగ్గర డబ్బులు లేవని భర్త రమేష్‌కు తెలిపింది. అయితే చెప్పిన పని చేయలేదని ఆమెను భర్త గట్టిగా మందలించాడు. దీంతో మనస్థాపానికి గురైన సుబ్బమ్మ సోమవారం రాత్రి ఇంట్లోనే ఉన్న ఎలుకల మందు తిని అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. ఇంటి బయట కూర్చున్న రమేష్ ఆమె పరిస్థితి గమనించి ఏమైంది అని గట్టిగా అడగడంతో ఎలుకల మందు తిన్నానని రమేష్‌కు చెప్పినట్లు ఆయన తెలిపారు. వెంటనే రమేష్ ఆటోలో నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లానని తెలిపారు. హాస్పిటల్లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం అందడంతో తోటపల్లిగూడూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

## రైలు డీకొని వ్యక్తి మృతి

**బిట్రగుంట మే 20 ప్రభాతవార్త:** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని కొడవలూరు పడుగుపాడు రైల్వే స్టేషన్ ల మధ్య దిగువ లైన్ లో కె ఎమ్.నెం 184/28-30 పోస్టుల మధ్య గుర్తు తెలియని సుమారు 40-45 సంవత్సరాల వయస్సు కలిగిన మగ వ్యక్తి రైలు కింద పడి మరణించడం జరిగిందని రైల్వే పోలీస్ లు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి కాషాయం రంగు నిండు చేతుల చొక్కా, పసుపు, మెరూన్ రంగుల లుంగీ ధరించి ఉన్నాడని, సదరు వ్యక్తి పొట్టపై నిలువుగా గతంలో చేయబడిన ఆపరేషన్ మార్క్ ఉందన్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం తరలించి కేసును కావలి జీఆర్పీ ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు. మృతుని ఆచూకీ తెలిసినవారు కావలి జీఆర్పీ పోలీసులను సంప్రదించాలని కోరారు..

## గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం : లైబ్రేరియన్ నిరూప



**విడవలూరు, మే 20, ప్రభాతవార్త:** మండల కేంద్రం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం లైబ్రేరియన్ నిరూప ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలపై అవగాహన కల్పించారు. తద్వారా జ్ఞానోదయం పొంది ఉన్నత స్థాయికి వెళ్లారని తెలియజేశారు. అంతకుముందు కథలు, చదువులు, డ్రాయింగ్ వాటిపై వివరించి తెలపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్వీ శేఖర్, సురేంద్ర, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వైభవంగా హనుమత్ గాయత్రి హోమం



**కోవూరు, మే 20 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రాతఃకాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో పంచామృత స్నపన, సహస్ర నామార్చన కార్యక్రమాలను సాం ప్రదా యబద్దంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో ప్రధాన రుత్వికులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, పంచగవ్యారాధన కార్యక్రమాలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమత్ గాయత్రి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యులు ,నందకిషోర్ స్వామి, భక్తులు ఉన్నారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా తలపల నరహరి, కుటుంబ సభ్యులు వ్యవహ రించారు.

## ఎస్టీల ఆధార్ స్పెషల్ క్యాంపును పరిశీలించిన ఎంపిడిఓ శ్రీదేవి



**కావలిరూరల్, మే20 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం సిరిపురం గ్రామ పంచాయితీ కార్యాలయంలో జరుగుతున్న ఎస్టీలకు సంబంధించిన ఆధార్ స్పెషల్ క్యాంపును మంగళవారం కావలి మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి వేపూరు శ్రీదేవి పరిశీలించి ఆధార్క్యా ంపు సిబ్బందికి తగుసూచనలు, సలహాలు తెలియ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సిరిపురం, రాజువారిచింతలపాలెం, కొత్తపల్లి, చలంచర్ల గ్రామపంచాయితీలలో ఉండే ఎస్టీ కుటుంబాలవారు ఆధార్ అవసరమైన వారు ఆధార్‌కార్డులు పొందుటకు సిరిపురం ఆధార్‌క్యాంపు సెంటర్‌ను సద్వినియోగ పర్చుకోవాలని కోరారు. అనంతరం సిరిపురం గ్రామపంచాయితీనందు చెత్తనుండి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించడం జరిగింది. తడిచెత్త, పొడిచెత్తను వేరువేరుగా అందచేయాలని, చెత్తను ఇంటివద్ద నుండి సేకరించే విధానం గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిరిపురం పంచాయితి కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మెడికల్‌లో అత్యంత అరుదైన ఆపరేషన్ విజయవంతం

**– క్లిష్టమైన ప్రదేశంలో కణితిని గుర్తించిన వైద్యులు**



**నెల్లూరు, మే 20, ప్రభాతవార్త -వైద్యం :** మెదడులో అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారని మెడికవర్ హాస్పిటల్ వైద్యులు వివరించారు. మెదడులో అత్యంత కీలకమైన ప్రదేశంలో ఏర్పడ్డ కణితిని 5గంటల ఆపరేషన్ నిర్వహించి విజయవంతంగా తొలగించారు. మంగళవారం ఈ మేరకు మెడికవర్ హాస్పిటల్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ గంగపట్నం దినేష్ విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. గూడూరు సమీపంలోని చెంబర్తి గ్రామానికి చెందిన 50 ఏళ్ల లక్ష్మి అనే మహిళ ఉన్న ఫలంగా కిందపడిపోయింది. భర్త పెంచలయ్య ఇతర కుటుంబ సభ్యులను పరిశీలించగా కాలు, చేయి చచ్చుబడిపోయినట్లు గుర్తించి నెల్లూరులోని ఓ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి తరలించేలోగా ఆమె కోమాలోకి వెళ్లిపోయిందని డాక్టర్ గంగపట్నం దినేష్ వెల్లడించాఉ. అక్కడ నయం కాకపోవడంతో నెల్లూరులోని మరో ఆసుపత్రికి తరలించారని అక్కడ నయం కాకపోవడంతో కొందరి సూచనల మేరకు చెన్నైకి తరలించారన్నారు. అయితే నెలలు గడుస్తున్నా ఆరోగ్యంలో ఎలాంటి పురోగతి లేకపోగా ఇంకా కోమలోని ఉండటంతో నెల్లూరులోని మెడికవర్ హాస్పిటల్‌కు తీసుకుని వచ్చినట్లు డాక్టర్ దినేష్ వెల్లడించారు. తాము పరీక్షలు నిర్వహించగా మెదడులోని అత్యంత కీలకమైన ప్రదేశంలో కణితి ఉన్నట్లు గుర్తించామన్నారు. వెంటనే శస్త్ర చికిత్స చేయాలని కుటుంబ సభ్యులకు వివరించగా వారు సమ్మతితో శస్త్ర చికిత్స నిర్వహించామని చెప్పారు. దాదాపు 5 గంటల పాటు శ్రమించి మెదడులో లోతైన బ్రెయిన్ స్టమ్ ప్రదేశంలో ఏర్పడ్డ కణితిని విజయవంతంగా తొలగించామని డాక్టర్ దినేష్ తెలియజేశారు. మెదడులో శస్త్ర చికిత్స నిర్వహించే క్రమంలో సాధారణంగా కణితి పక్క నున్న భాగాలు దెబ్బతినే ప్రమాదముందని, కానీ తాము అలాంటివి లేకుండా చాలా జాగ్రత్తలు తీసుకొని సురక్షితంగా శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించామన్నారు. శస్త్ర చికిత్స తర్వాత కూడా రోగి విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. ప్రతి రోజు వ్యాయామం, ఫిజియోథెరపి నిర్వహించామని పేర్కొన్నారు. రోగి కోమాలో నుండి బయటకు రావడమే కాకుండా పూర్తిగా కోలుకుందని, ప్రస్తుతం ఆమె పనులు ఆమె చేసుకుంటూ ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగిస్తున్నారని వెల్లడించారు. రోగి కుటుంబం పేద వారు కావడంతో ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తిగా ఉచితంగా శస్త్ర చికిత్స నిర్వహించామన్నారు. రోగిని డిశ్చార్చ్ చేసినట్లు డాక్టర్ గంగపట్నం దినేష్ వెల్లడించారు. న్యూరాలజీకి సంబంధించి మెడికవర్ హాస్పిటల్‌లో అధునాతన వైద్యం అందుబాటులో ఉందని, రోగులు మెడికవర్ సేవలను సద్వినియోగం చేసుకోవానలి సూచించారు. రోగి లక్ష్మి భర్త పెంచలయ్య మాట్లాడుతూ చనిపోతుందన్న భయంతో వచ్చిన తమకు ధైర్యం చెప్పి, విజయవంతంగా ఆపరేషన్ చేసి తన భార్యను బ్రతికించి, పూర్తి ఆరోగ్యంతో తమకు అప్పగించిన డాక్టర్ గంగపట్నం దినేష్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఈ విలేకర్ల సమావేశంలో డాక్టర్ గంగపట్నం దినేష్‌తో పాటు పాటు మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్‌రెడ్డి, న్యూరో విభాగం వైద్యులు, సిబ్బంది, పీఆర్వో చందు వర్మ పాల్గొన్నారు.

## మహానాడు కమిటీలో దినేష్‌రెడ్డికి స్థానం



**కోవూరు, మే 20 ప్రభాతవార్త :** కడపలో ఈ నెల 27,28,29 తేదీల్లో జరగనున్న తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మక మహానాడు కమిటీలో ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డికి తెలుగుదేశం పార్టీ అధినాయకత్వం స్థానం కల్పించింది. వాహన పార్కింగ్ కమిటీలో దినేష్‌రెడ్డిని సభ్యులుగా ఎంపిక చేయడం పట్ల కోవూరు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, మే 20 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రాతఃకాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో పంచామృత స్నపన, సహస్ర నామార్చన కార్యక్రమాలను సాంప్రదాయబద్దంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలంగి సేవ,పల్లకి సేవ కార్యక్రమాలను కనులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా అత్తిపల్లి శ్రీనివాసులు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకిషోర్ స్వామి, ఫణీంద్ర స్వామి, భక్తులు ఉన్నారు.

## మన్నవ అద్వైత్‌చౌదరి పుట్టినరోజు సందర్భంగా అన్నా క్యాంటీన్‌లో అన్నదానం



**కావలిరూరల్, మే20 ప్రభాతవార్త :** తెలుగు దేశంపార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, సీనియర్ తెలుగు దేశం పార్టీ నాయకులు మన్నవ రవిచంద్ర మను మడు అమెరికా లోని సెయింట్ లూయిస్‌లో ఉంటు న్న మన్నవ అద్వైత్ చౌదరి 8వ పుట్టినరోజు వేడు కలు కావలి పట్టణం లో మంగళవారం ఘనంగా నిర్వహిఒచడం జరిగింది. ఈ సందర్భంగా కావలి పట్టణంలోని అన్నా క్యాంటీన్‌నందు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం మొత్తం ఎని మిది వందల మందికి అన్నదానం నిర్వహిం చడం జరిగింది. ఈ సందర్భంగా మన్నవ రవిచంద్ర మాట్లాడారు. నా కుమారులు అమెరికాలో ఉంటున్నా కూడా నా మనుమలు, మనుమరాళ్ల జన్మదిన వేడు కలను కావలి పట్టణంలో పేద ప్రజల మధ్య జరుపుకోవడం ఆనవాయితీగా జరుగుతుందని తెలియచేశారు. అందులో భాగంగా నా మనుమడు మన్నవ అద్వైత్‌చౌదరి పుట్టినరోజు సందర్భంగా అన్నా క్యాంటీన్‌నందు అన్నదానం నిర్వహించడం జరిగిందని తెలియచేశారు. గతంలో కూడా అన్నాక్యాంటీన్ నందు అన్నదానం, కావలి పట్టణ మరియు పరిసర ప్రాంత యాచకులకు వస్త్రాలు, బిరియానిపాకెట్లు, స్వీట్లు కూడా పంపిణి చేయడం జరిగిందని తెలియచేశారు. మా కుటుంబంలో ఎవరి పుట్టినరోజు అయినా పేదప్రజలకు సేవాకార్యక్రమాలు కొనసాగిస్తూనే ఉంటామని తెలియచేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలువురు మన్నవ అద్వైత్‌చౌదరికి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వల్లూరు మహేష్‌నాయుడు, తుమ్మల హరీష్, పులివర్తి రాజశేఖర్, వల్లూరి చెన్నకేశవులు, ఎండ్లూరి గోపీచంద్, ఈర్పనేని మహేష్, ఉప్పాల శ్రీనివాసులు, మన్నెం కోటయ్య చౌదరి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బ్యాంకు రుణాలతో స్వయం సమృద్ధి



**వింజమూరు, మే20, ప్రభాతవార్త :** డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయం ద్వారా స్వయం సహాయక సభ్యులు బ్యాంకు రుణాలతో స్వయం సమృద్ధిని పొందగలరని కార్యాలయ సీపీ సుశీల పేర్కొన్నారు. మంగళవారం డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఊటుకూరు క్లస్టర్ సభ్యుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సంఘబంధ సభ్యులు బ్యాంకుల ద్వారా రుణాలు పొంది తమ తమ జీవితాలకు అనుగుణంగా ఉపాధిని ఏర్పాటు చేసుకుని పెంపొందాలన్నారు. గేదెలు పెంపకం గాని, జీవాల పెంపకం గాని, చిల్లర దుకాణం కానీ ఏర్పాటు చేసుకుని తమ జీవవాన్ని మెరుగుపరుచుకోవాలని తెలిపారు. అలాగే రుణాలు పొందిన సభ్యులు సకాలంలో సక్రమంగా చెల్లించే విధంగా ఉండాలన్నారు. అప్పుడే బ్యాంకుల దృష్టిలో మన పరపతి బాగుంటుందన్నారు. భవిష్యత్తులో అధిక రుణాలు పొందేందుకు వీలు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీ లక్ష్మి కుమారి, వీఓఏ జయలక్ష్మి, సిబ్బంది, సువార్తమ్మ, సంఘ సభ్యులు తదితరులు ఉన్నారు.

## రీ సర్వేకు రైతులు సహకరించాలి



**కోవూరు, మే 20 ప్రభాతవార్త :** కోవూరు మండలం వేగూరు పంచాయతీలో జరుగుతున్న రీ సర్వే కార్యక్రమానికి రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు తెలిపారు. కోవూరు మండలం వేగూరు గ్రామంలో జరుగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే బృందం ఏ రోజు ఏ ప్రాంతానికి వెళ్లి సర్వే చేస్తారో రెండు రోజుల ముందుగానే ఆ ప్రాంత రైతులకు సమాచారం ఇవ్వడం జరుగుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని భూములకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే ఈ సర్వేలో వాటిని క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ రమేష్ గౌడ్, గ్రామ సర్వేయర్లు ఉన్నారు.

## కండలేరులో 42.974 టీయంసీల నీటిమట్టం



**రాపూరు,మే20ప్రభాతవార్త :** మండలంలోని కండలేరు జలాశయంలో మంగళవారం ఉదయం నాటికి జలాశ యంలో 42.974 టీయంసీల నిటిమట్టం నమెదు అయినట్లు కండలేరు ఎఇ తిరుమలయ్య తెలిపారు. జలాశయం నుండి హెడ్ రెగ్యులేటర్ ద్వారా 2040 క్యూసెక్కులు, లో లేవల్ స్లూయిస్ ద్వారా 60 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 110 క్యూసెక్కుల చొప్పున మొత్తం 2210 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## అభిమానుల కేరింతల మధ్య జూనియర్ ఎన్‌టిఆర్ జన్మదిన వేడుకలు



**కావలి, మే20 ప్రభాతవార్త :** అభిమానుల కేరింతలు, డ్యాన్సుల మధ్య యంగ్ టైగర్ జూనియర్ ఎన్‌టిఆర్ జన్మదిన వేడుకలు హోరెత్తాయి. కావలి జూనియర్ ఎన్‌టిఆర్ రాష్ట్ర ఫ్యాన్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మాజీ ఎఎంసి ఛైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు సూచనల మేరకు కావలి పట్టణ మానస హాల్‌సెంటర్‌లో మంగళవారం జూనియర్ ఎన్‌టిఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. నందమూరి అభి మానులు భారీకేక్‌ను కట్‌చేశారు. తీన్మార్ డ్యాన్సులతో బాణాసంచా వెలుగుల మధ్య అభిమానుల కేరింతలతో సందడి చేశారు. జూనియర్ ఎన్‌టిఆర్ జిందాబాద్ అన్న నినాదాలతో ఆ ప్రాంతం మారుమ్రోగింది. కావలి టౌన్‌వైడ్ యంగ్ టైగర్ ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు గునుపూడి కృష్ణ, గౌరవ అధ్యక్షులు సూరిశెట్టి రామకృష్ణ, ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ నేతలు రామయ్య, సందీప్, అంబటి కిషోర్, శ్రీహరి, తారక్, మధు, మురళి, తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ కోడ్‌లు రద్దుచేయాలి

## కావలిలో కార్మికసంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



**కావలి, మే20 ప్రభాతవార్త :** కేంద్ర ఎన్‌డిఎ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని కార్మికసంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కార్మికసంఘాల నాయకులు, సిఐటియునేత పసుపులేటి పెంచలయ్య, ఎఐటియుసి నాయకులు మల్లె అంకయ్య, ఎఐఎఫ్‌టియు (న్యూ) నేత లక్ష్మారెడ్డిలు పాల్గొని మాట్లాడారు. కార్మికసంఘాల ఐక్యవేదిక దేశవ్యాప్త పిలుపుమేరకు నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని నిరసనర్యాలీ చేపట్టడం జరిగిందన్నారు. కేంద్రప్రభుత్వం గతంలో కార్మికసంఘాలు ఎన్నో పోరాటాలుచేసి సాధించుకున్న కార్మిక చట్టాలను సవరించి, కార్మికులకు ప్రమాదకరమైన నాలుగు లేబర్‌కోడ్‌లు తీసుకువచ్చిందని దుయ్యబట్టారు. వీటివలన కార్మికులు చాలా ఇబ్బందులకు గురౌతారన్నారు. కార్మికులకు భద్రత, యూనియన్ పెట్టుకునే హక్కు, సమ్మెచేసే హక్కు కూడా లేకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. ఇది కేంద్రప్రభుత్వం కార్మికులను ఇబ్బందుల్లో పెట్టే ఆలోచనతో ఇలాంటి చట్టాలు తీసుకువచ్చిందన్నారు. పనికి తగిన వేతనంకింద 26 వేలు అమలుచేయలేదన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయలేదన్నారు. తక్కువ వేతనాలతో ఎక్కువ పనులు చేయిస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే రకరకాల పేర్లతో అనేక రకాలుగా ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే కార్మికులమీద పనిభారం పెంచిందన్నారు. ఇవి దుర్మార్గమైన చర్యలు అన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు అమలుచేయాలని కోరారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిలిపివేయాలన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలన్నారు. పనికి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన ర్యాలీలో సిఐటియు నాయకులు వై.కృష్ణమోహన్, బి.కృష్ణయ్య, పి.తిరుపాలు, తురక శీనయ్య, ఎఐటియుసి నాయకులు ఎండ్లూరి ఆదినారాయణ, దర్గాబాబు, ఎఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు ఎల్.శ్యామలమ్మ, కార్మికసంఘాల నేత నాయకులు, బిడదల మహేష్, ఒంగోలు రమేష్, మున్సిపల్ కార్మికులు, స్కూల్ స్వీపర్లు, రైల్వే స్వీపర్లు, ఆశావర్కర్లు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ నిరసన ర్యాలీ కావలి ఏరియా ఆసుపత్రి నుండి కావలి పట్టణ మాగుంట పార్వతమ్మ ట్రంకురోడ్డు మీదుగా కోర్టుసెంటర్, కూరగాయల మార్కెట్, ఉదయగిరి బ్రిడ్జిసెంటర్‌కు చేరింది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహంవద్ద నిరసనలు వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ భూములు కబ్జా అవుతుంటే మంత్రి ఏం చేస్తున్నారు..?



**నెల్లూరు రూరల్, మే 20, ప్రభాతవార్త :** ప్రభుత్వ భూములు కబ్జా అవుతుంటే చోద్యం చూస్తున్నారా నారాయణ పేపర్లకు ప్రకటన ఇవ్వడం తప్ప కబ్జా జరుగుతున్న ప్రభుత్వ భూముల పై ఎలాంటి చర్యలు లేవే అంటూ వైఎస్ఆర్సిపి అధికార ప్రతినిధి మల్లి నిర్మల మంత్రి నారాయణ ప్రశ్నించారు. సిటీ నియోజకవర్గంలో కోట్ల రూపాయలు విలువచేసే ప్రభుత్వ భూముల్లో టిడిపి నాయకులు కబ్జా చేస్తుంటే చోద్యం చూస్తున్నారా అంటూ ఎద్దేవా చేశారు. ఆక్రమణలలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటాం అని, నిన్న జరిగిన క్యాంపు కార్యాలయ సమావేశంలో మంత్రి నారాయణ మాట్లాడటం చాలా విడ్డూరంగా ఉందని ఆమె అన్నారు. మాటలు పనిచేసేదేమైనా ఉందా మంత్రి అంటూ ఆమె మీడియా ముఖ్యంగా అడిగారు. ప్రజాధనాన్ని దోచుకుంటున్న వారిని చూసి చూడనట్టు ఉండడం, ఇసుక కబ్జా విషయంలో కూడా అన్నీ తెలిసి ఏమీ తెలియనట్టు ఉండడం ,భూములు కబ్జా విషయం కూడా అన్నీ తెలిసి ఏమీ తెలియనట్టు ఉన్న నారాయణ కి ఉత్తమ నటుడు అవార్డుని ఇవ్వచ్చు అని ఆమె అన్నారు. అంటే ప్రభుత్వ భూములు, స్థలాలు కబ్జా అయ్యాయి అన్న విషయం నారాయణకి పూర్తి సమాచారం ఉంది, అని మల్లి నిర్మల అన్నారు. ఒక్క ప్రభుత్వ భూమిని అయిన మీరు స్వాధీనం చేసుకొని మీడియా సమావేశంలో చెప్పగలరా లేదంటే మేము వస్తాం, మీకు, మీడియా మిత్రులకు భూములు చూపించగలం. మీరు మాతో వస్తారా, అని నిర్మల అన్నారు. ఇసుక కబ్జా జరుగుతుంటేనే చూసి చూడనట్టు ఉంటున్న మీరు, ప్రభుత్వ భూములను ప్రభుత్వానికి అప్పజెప్పే పనిచేయగలరా, అని నిర్మల అన్నారు. నెల్లూరు నగర ప్రజలు కూడ మీరు ఇచ్చిన ప్రజా సంక్షేమ పథకాల కోసం ఎదురు చూస్తున్నారు అని తెలియజేశారు. నేతి బీరకాయలో నెయ్యి ఎలా ఉండదో , మీ మాటలలో నిజాయితీ కూడా అలానే. అని నిర్మల ఎద్దేవా చేశారు. మీకు చిత్తశుద్ధి ఉంటే మీ మాటని నిలబెట్టుకోవాలని, వందల కోట్లు విలువచేసే ప్రభుత్వ భూములను, స్థలాలను ప్రభుత్వానికి అప్ప చెప్పాలని ఆమె అన్నారు. ఈ విషయంలో వైఎస్ఆర్సిపి నిజాయితీగా ప్రజల పక్షాన పోరాటం చేస్తామని తెలిపారు.

## ఎస్ఈగా శ్రీనివాసరావుకి పదోన్నతి



**నెల్లూరు, మే 20, ప్రభాతవార్త-వైద్యం :** సివిల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్‌గా నెల్లూరులో పని చేస్తున్న కే.శ్రీనివాసరావుకి ఎస్ఈగా పదోన్నతి ఇవ్వడం జరిగింది. ఆయన సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్ఈ) సివిల్, కార్పొరేట్ ఆఫీసు, తిరుపతిలో పదోన్నతి పొందారు. జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ వి.విజయన్, పీఎం సూర్యఘర్, కుసుమ్, ఈవీ ఛార్జింగ్ స్టేషన్స్ నోడల్ ఆఫీసర్ శేషాద్రి బాలచంద్ర, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళీ, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్, శ్రీధర్, సోమశేఖర్‌రెడ్డి, బెనర్జీ, రమేష్ చౌదరి, శ్రీనివాసులు, సుధాకర్, పరందామయ్య, లక్ష్మీ నారాయణ, జిల్లాలోని డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్స్, ఉద్యోగులు వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినీలుకు జడ్ పీ చైర్ పర్సన్ అరుణమ్మ అభినందనలు



**నెల్లూరు కలెక్టరేట్,మే 20,ప్రభాతవార్త** ఇండస్ట్రియల్ ట్రైనింగ్‌లో భాగంగా మేనేజ్మెంట్ సిస్టం, ప్రొసీడర్స్ ట్రైనింగ్ పొందుటకు ఆరు నెలలు పాటు ట్రైనింగ్‌లో పాల్గొన్న ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినీలు ట్రైనింగ్ పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం నందు జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మవిద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ, డిప్యూటీ సీఈవో, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రేషన్ పంపిణీ కార్యక్రమనికి పునఃప్రారంభం



**నెల్లూరు కలెక్టరేట్, మే 20, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా యునైటెడ్ చౌక ధరల దుకాణదారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కూటమి ప్రభుత్వానికి ఎంతో రుణపడి ఉన్నదని రాష్ట్రంలో గల 29 వేల మంది రేషన్‌డీలర్లకు అలాగే నెల్లూరు జిల్లాలో గల 1513 మంది రేషన్ డీలర్లకు శుభవార్త అందించినందుకు గాను నెల్లూరు జిల్లా రేషన్ డీలర్లు అందరూ నాలుగు సంవత్సరాలు పైచిలుకు గత ప్రభుత్వంతో ఎంతో పోరాటం చేసి రేషన్ డీలర్ల యొక్క హక్కు రేషన్ పంపిణీ చేయడమే దానిని పొందడానికి పడ్డ కృషి వర్ణనాతీతం కూటమి ప్రభుత్వం ఎండియు (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వ్యవస్థని గత ప్రభుత్వం తీసుకువచ్చి రేషన్ డీలర్‌కు గుదిబండగా చేసింది ఆనాటి నుండి నేటి వరకు రేషన్ డీలర్ల వ్యవస్థ హక్కు అయిన పంపిణీ కొరకు పోరాడుతూనే ఉంది రాష్ట్రంలో గల ఎండియు వ్యవస్థను కూడా తొలగించి రేషన్ డీలర్ల కుటుంబాలలో వెలుగును నింపిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని తెలియజేసుకుంటూ ఈ ప్రభుత్వానికి నెల్లూరు జిల్లా యునైటెడ్ చౌక ధరల దుకాణదారుల సంక్షేమ సంఘం వారు చిరు సత్కారంగా పాలాభిషేకం చేసుకుని మిఠాయిలు పంచుకొని ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ రేషన్ డీలర్లు జూన్ ఒకటో తేదీనుండి రేషన్ పంపిణీ కార్యక్రమంకి పునఃప్రారంభం అవుతున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.నెల్లూరు జిల్లా అధ్యక్షులు సుదర్శన రమేష్, ఉపాధ్యక్షులుపాబోలు వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి జీవీ కృష్ణారెడ్డి, జిల్లా మీడియా ఇంచార్జ్ ఎం రమేష్, జిల్లా సంయుక్త కార్యదర్శి కె సురేష్, నెల్లూరుటౌన్ అండ్‌రూరల్ డీలర్లు మండలాలనాయకులు పాల్గొని ఈకార్యక్రమాన్ని జయప్రదం చేసారు.

## మాదక ద్రవ్యాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహణ



**నెల్లూరు కలెక్టరేట్, మే 20, ప్రభాతవార్త** మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలపై యువతకు అర్థమయ్యేలా అవగాహన కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులకు సూచించారు. మంగళవారం ఉదయం కలెక్టర్ వారి చాంబర్‌లో నషా ముక్త భారత్ అభియాన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వశాఖ మార్గదర్శకాల మేరకు జిల్లావ్యాప్తంగా గంజాయి, పొగాకు, గుట్కా, డ్రగ్స్ తదితర మాదక ద్రవ్యాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో, జనసంచార ప్రదేశాల్లో మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయం వలన దుష్ప్రరిణామాలు, చట్టపరంగా అమలవుతున్న శిక్షలపై అవగాహన కల్పించాలన్నారు. పోస్టర్లు, కరపత్రాలు ముద్రించాలన్నారు. కమిటీలోని సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి మాదకద్రవ్యాల నివారణకు కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో వివిధ ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఎడి మహ్మద్ అయూబ్, సూపరింటెండెంట్ సంధ్యారాణి, ఐసిడిఎస్ పిడి సువర్ణ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, ఆర్ఐవో వరప్రసాద్, బాలల సంరక్షణ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కోవూరు మిని మహానాడుకు భారీగా తరలిన బుచ్చినేతలు



**బుచ్చి మే 20 ప్రభాతవార్త** కోవూరులో మంగళవారం జరిగిన మినిమహానాడుకు బుచ్చి రెడ్డిపాళెం నుండి టౌన్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు ఆధ్వర్యంలో పెద్దఎత్తున తరలి వెళ్లారు. గుత్తా శ్రీనివాసు లుమాట్లాడుతు ఎంపి వేమిరెడ్డిప్రభాకర్‌రెడ్డి , కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పిలుపు మేరకు మిని మహానాడుకు తరలినట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా,మురళీ, గౌరవాధ్యక్షులు టంగుటూరు మల్లికా ర్జునరెడ్డి, వైస్ చైర్మపర్సన్ పఠాన్ నస్రీన్, పఠాన్ మహబూబాషా నాయకులు ఎం.వి శేషయ్య, జొన్నవాడ దేవస్దానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు,కౌన్సిలర్ పుట్టాలక్ష్మీకాంతమ్మ, జొన్నవాడ దేవస్దానం సేవా కమీటి సభ్యులు తిరువాయి పాటి నందకుమార్, వింజం రామానాయుడు,వింజం మహేష్ నాయుడు, కౌన్సిలర్ చీర్ల ప్రసాద్‌యాదవ్ , కౌన్సిలర్ రహమత్, కౌన్సిలర్ రాచూరు సత్యనారాయణ, కిషోర్, కడివేటి హరిరెడ్డి, యిమ్మడి శెట్టి మల్లికార్జునపలువురు టిడిపినాయకులు పెద్దఎత్తున కార్ల ర్యాలీగా తరలి వెళ్లారు.

## యోగోత్సవ్ 2025లో గీతాంజలి ఎన్ఎస్ఎస్ విద్యార్థులు



**కోవూరు, మే 20 ప్రభాతవార్త :** ఏసీ సు బ్బారెడ్డి స్టేడియంలో మంగళవారం జరిగిన యోగోత్సవ్ 2025 కార్యక్రమంలో కోవూరు లోని గంగవరం గీతాంజలి కళాశాల ఎన్ఎ స్ఎస్ విద్యార్థులు 50 మంది హాజర య్యా రని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సందీప్ కుమార్ తెలిపారు. ఈకార్యక్రమంలో భాగంగా తమకళాశాల విద్యార్థులు యోగాలోని ప్రాథమిక ఆసనాలను, సూర్య నమస్కారం వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా తమ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రశంసా పత్రాలు పొందారని ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి వై. మురళీకృష్ణ తెలిపారు.

## ఈకేవైసీని సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, మే 20 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధిం చిన రేషన్ కార్డుదారులు ఈకేవైసీ పెం డింగ్ ఉంటే ఈ నెలాఖరులోగా వాటిని పూర్తిచేసు కోవాలని తహసీల్దార్ నిర్మలానందబాబా తెలిపారు. ఈ మేరకు మం గళవారం కార్యా లయంలో ఆయన మాట్లాడుతూ మొత్తం కోవూరు మండలానికి సంబంధించి 61674 యూనిట్లు ఉండగా.. ఇప్పటివరకు 57389 యూనిట్లకు ఈకేవైసీ పూర్తి కావ డం జరిగిందన్నారు. ఇంకా 3698 మంది ఈకేవైసీ చేయించు కోవాల్సి ఉందని, అటువంటి వారు ఈ నెలాఖరులోగా ఈకేవైసీ చేసుకోకపోతే జూన్ నెల నుంచి వారికి రేషన్ వచ్చే అవకాశం ఉండదన్నారు. దీనిని దృష్టిలో పెట్టు కుని డీలర్ల వద్ద గానీ, ఈ పాస్ మిషన్లలో ఈకేవైసీని నమోదు చేసుకోవాలన్నారు.కోవూరు మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించి కొత్తగా రేషన్ కార్డుల కొరకు సంబంధిత గ్రామాల్లో ఉన్న గ్రామ సచి వాలయాల్లో అర్హత కలిగిన లబ్దిదారులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ నిర్మలానంద బాబా తెలిపారు. ఉన్న రేషన్ కార్డుల్లో అదనంగా సభ్యులను చేర్చుకునే అవకాశం , మృతి చెందిన వారు, వివాహం చేసుకుని వెళ్లిన వారు సభ్యులను తొలగించే అవకాశం, అదేవిధంగా రేషన్ కార్డులో అడ్రస్సులు చేసుకునే అవకాశం కూడా ప్రస్తుతం ప్రభుత్వం కల్పించిందని ఈ అవకాశాన్ని అర్హత కలిగిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## దాతల సౌజన్యంతో పాఠశాలల్లో అధునాతన సౌకర్యాలు



**నెల్లూరు కార్పొరేషన్,మే 20 ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలోని వివిధ మున్సిపల్ పాఠశాలల్లో దాతల సౌజన్యంతో అధునాతన వసతులను కల్పిం చేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని కమిషనర్ వై.ఓ నందన్ అధికారులకు సూ చించారు.మున్సిపల్ పాఠశాలల ఆధునీ కరణ పనుల్లో భాగంగా కమిషనర్ మంగళ వారం స్థానిక వి.ఆర్ విద్యాసంస్థల ప్రాంగణం, మూలాపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలకు అవసరమైన అన్నిఅధునాతనవసతులు, అదనపు నూతన ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ను ఏర్పా టు చేయాలని సూచించారు. పాఠశాలలకు కావలసిన అన్ని ఆధునిక ఏర్పాట్ల ను డి.ఎస్.ఆర్ సంస్థ ద్వారా సమకూరుస్తామని చైర్మన్ దేవిరెడ్డి సుధాకర్ రెడ్డి కమిషనర్ కు తెలియజేశారు.

## కనులపండువగా పతాకావిష్కరణ

**కోవూరు, మే 20 ప్రభాతవార్త :** కోవూరులోని పీవీఆర్ కళ్యాణ మండపం ప్రాంగణంలో మంగళవారం కోవూరు నియోజకవర్గానికి సంబంధించి మినీ మహానాడు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆ ప్రాంగణంలో టీడీపీ పతాకాన్ని పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిలు ఆవిష్కరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించిన ఈ మినీ మహానాడు కార్యక్రమానికి ఐదు మండలాలకు సంబంధించిన ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, బుచ్చి మున్సిపల్ చైర్మన్ మోర్ల సుప్రజ, జొన్నవాడ దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ టి. అశోక్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కోదూరు కమలాకర్‌రెడ్డి, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి, దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, ఐదు మండలాలకు సంబంధించిన నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీపీ వై. రమణమ్మ, నేతలు అశోక్‌కుమార్, మధుసూదన్‌రావు, ఇంతా మల్లారెడ్డి, కోవూరు నీటి సంఘం చైర్మన్ అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, గోవిందు, టవి కుమాం బాల రవి, ఎన్. వెంకట్, ఎం.సుధాకర్, వేగూరు సుబ్బానాయుడు, కె. శ్రీనివాసులు, సర్పంచ్‌లు కె. అమరావతి,వై. విజయ,ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, సునీల్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌నాయుడు, వీరేంద్రనాయుడు, అమరేంద్ర రెడ్డి, పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు ఉన్నారు

## అధాని వరల్డ్ స్కూల్‌లోని సైనిక్ ఎన్‌సీసీ క్యాడెట్లకు పతకాలు, పదోన్నతులు



**ముత్తుకూరు, మే 20, ప్రభా త వార్త** అక్షర విద్యాలయంలో 24 ఆంధ్ర బెటాలియన్ శిక్షణా శిబిరం విజయవంతంగా ముగిసింది. నెల్లూరు జిల్లా చవటపాళెం పం చాయతీ పరిధిలో ఉన్న సరస్వ తీనగర్ అక్షర విద్యాలయంలో 24 ఆంధ్ర బెటాలియన్ ఎన్. సి సి వార్షిక శిక్షణా శిబిరం విజయ వంతంగా ముగిసింది. శిబిరంలో క్యాడెట్లకు క్రమశిక్షణ, నాయకత్వం, పౌర సమాజ బాధ్యతలపై అవగాహన కల్పించడంతో పాటు, క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా క్యాంప్ కమాండెంట్ కల్నల్ డి. కరంచంద్ మాట్లాడుతూ, ఎన్. సి. సి శిక్షణ అనేది విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణను సమాజం పట్ల సేవా భావాన్ని పెంపొందించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మేజర్ రాజేష్ కుమార్, హేమంత్ కుమార్, క్యాంప్ అధికారి బాలబ్రహ్మాచారి పాల్గొ న్నారు. ఈ క్యాంప్లో 650 మంది క్యాడట్స్ పాల్గొన్నారు. అందులో అదాని వరల్డ్ స్కూల్ కాడెట్ శ్రీరామ్ కు ప్రత్యేకంగా సార్జెంట్ హోదా లభించింది. కాడెట్ అసువినేష్‌కు కార్పొరల్, కాడెట్ సంజీవ్, నేహాశ్రీక్షిత, వైష్ణవిలకు లాన్స్ కార్పొరల్‌గా పదోన్నతులందుకున్నారు. వైష్ణవి ఉత్తమ షూటర్‌గా, శ్రీరామ్ ఉత్తమ క్యాడెట్గా, నేహాశ్రీక్షితకు ఉత్తమ బృంద నాయకురాలిగా ఎంపికై పతకాలు అందుకున్నారు. ఈ శిబిరాన్ని ప్రశంసిస్తూ సైనిక్ క్యాడెట్లను ఆదానీ వరల్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజేష్ శర్మ ప్రత్యేకంగా అభినందించారు. కీప్ లెర్నింగ్, కీప్ గ్రోయింగ్ టూగెథర్ అన్న నినాదంతో ఈ శిబిరం ముగిసింది. క్యాడెట్లందరికీ వారి తల్లీ దండ్రులు అడ్మిన్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసారు.

## పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి



**నెల్లూరు రూరల్, మే 20, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 20 మందికి మంజూరైన రూ.19లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధితులకు పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 20 మందికి మంజూరైన రూ.19లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధితులకు టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి అందించారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని చికిత్సలు పొందిన వారితో పాటు ఇతర రాష్ట్రాల్లోని ఆస్పత్రుల్లో వైద్యం పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరం అని అన్నారు. పేదల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఉదారంగా సాయం మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని చికిత్సలు పొందిన వారితో పాటు ఇతర రాష్ట్రాల్లోని ఆస్పత్రుల్లో వైద్యం పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరం అన్నారు. పేదల ప్రయో జనాలను దృష్టిలో ఉంచుకుని ఉదారంగా సాయం మంజూరు చేస్తున్నారని ఆయన కొనియాడారు.

## పూడికతీతకు జెన్ రోబోటిక్స్ మిషన్ పనితీరు పరిశీలనలో కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్,మే 20 ప్రభాతవార్త:** మేజర్ మైనర్ డ్రైన్ కాలువలలో పూడికతీత పనుల కోసం రూపొందించిన నూతన మిషన్‌నుప్రయోగాత్మకంగా ఉపయోగించి ఫలితాలను నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ పరిశీలించారు. స్థా నిక రామ్మూర్తి నగర్ ప్రాంతంలోని ప్రధాన డ్రైన్ కాలువకు జెన్ రోబోటిక్స్ మెషిన్ ను అనుసంధా నించి పూడికతీత పనులను మంగ ళవారం చేపట్టారు. మిషన్ పనితీరును పరిశీలించిన కమిషనర్ డ్రైను కాలువల పూడికతీత కన్నా లోతైన బావులు, నూతుల నుంచి పూడికను తొలగించేందుకు ఈమిషన్ అనువు గా ఉందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ విభాగం ఈ.ఈ శ్రీనివాసులు, ఏ.ఈ పాల్గొన్నారు.

## ట్యాక్స్ రివిజన్ సర్వేకు అత్యంత ప్రాధాన్యత కల్పించండి

### - కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్,మే 20 ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రజలకు అవసరమైన మౌళిక వసతులు కల్పించేందుకు, నగర వ్యాప్తంగా అభివృద్ధిపనులను చేపట్టేందుకు అవసరమైన నిధులను పన్నుల ద్వారా సేకరించిన మొత్తాలనుంచే కేటాయించగలమని, కావున ట్యాక్స్ రివిజన్ సర్వేకు అత్యంత ప్రాధాన్యత కల్పించాలని కమిషనర్ వై.ఓ నందన్ రెవెన్యూ అధికారులు, వార్డ్ అడ్మిన్ కార్యదర్శులకు సూచించారు. రెవెన్యూ శాఖ వారాంతపు సమీక్షా సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ఉత్తర్వుల మేరకు ప్రతి అడ్మిన్ కార్యదర్శి సచివాలయ ఇతర కార్యదర్శులను సమన్వయం చేసుకుని ఇంటింటి ట్యాక్స్ రివిజన్ సర్వే నిర్వహించాలని సూచించారు. సర్వే ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని అదనంగా రెవెన్యూ ఇన్స్పెక్టర్ల నియామకం చేపట్టా మని తెలిపారు. అడ్మిన్ కార్యదర్శులు ప్రతిరోజూ క్షేత్ర స్థాయిలో పర్యటించి పన్నుల సవరణల సర్వేను పూర్తి చేయాలని, రెవెన్యూ వసూళ్లను గత ఆర్థిక సంవత్సరం కన్నా అదనంగా20 శాతం డిమాండ్ పెంచా లని సూచించారు. సచివాలయాల మేరకు నిర్దేశించిన సర్వే రివిజన్ లక్ష్యాలను అడ్మిన్ కార్యదర్శుల ద్వా రా పూర్తి చేయించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. సర్వే రివిజన్ వంద శాతం పూర్తయ్యేందుకు వీలుగా అడ్మిన్ కార్యదర్శులకు సచివాలయాల వారీగా బదిలీలను చేపట్టనున్నామని కమిషనర్ తెలిపారు. రెవెన్యూ వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారు, విధులలో మెరుగైన పనితీరు కనబరచనివారు, రాష్ట్ర ప్రభుత్వం నిర్దే శించిన సర్వేలలో అలసత్వం వహిం చిన కార్యదర్శులపై శాఖాపరమైన చ ర్యలు తప్పవని కమి షనర్‌హెచ్చ రించారు.ఈ సమావేశంలో నగరపాలక సం స్థ డిప్యూ టీ డైరెక్టర్ మా ధురి, రెవె న్యూ అధికారులు సమద్, శ్రీనివాసులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు, వార్డు సచి వాలయ అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.







## పార్టీని మరింత బలోపేతం చేయాలి

### - ఐదు మండలాల అధ్యక్షులను పరిచయం చేసిన ఎమ్మెల్యే



**కోవూరు, మే 20 ప్రభా తవార్త :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నూతనంగా ఐదు మండలాల్లో బాధ్యతలు స్వీ కరించిన మండల పార్టీ అ ధ్యక్షులు ఆయా మండలా ల్లో ఉన్న పార్టీ సీనియర్ నాయకులు, ఇతర పార్టీ నుంచి వచ్చిన నేతలను కలు పుకుని పార్టీని మరింత బలోపేతం చేసేలా చొరవ తీసుకోవాల్సి న అవసరం ఉందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరులోని పీవీఆర్ కళ్యాణ మండపంలో మంగళవారం మినీ మహానాడు కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె నూతనంగా పార్టీ ఆదేశాల ప్రకారం ఎంపిక చేసిన నియోజ కవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించిన మండల పార్టీ అధ్యక్షులు కె. సుధాకర్‌రెడ్డి, నాపా వెంకటేశ్వర్లు నాయుడు, ఏటూరు శ్రీహరిరెడ్డి, యేకొల్లు పవన్ రెడ్డి, గుత్తా శ్రీనివాసులు, బెజవాడజగదీష్, టంగుటూరు మల్లికార్జునలను నియోజకవర్గ నేతలకు, కార్యకర్తలకు పరిచయంచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యు వ నాయకత్వంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రోత్సా హంతో జిల్లా పార్టీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో ఐదు మండలాల్లో పార్టీ బలోపేతమే లక్ష్యంగా మండలాధ్యక్షులను ప్రకటించడం జరిగిం దన్నారు. నూతనంగా ఎంపికైన మండలాక్షులు శక్తి వంచన లేకుండా పనిచేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలను కలుపుకుని ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న వివిధ పథకాలను మంచిని ప్రజల చెంతకు చేర్చేలా నిరంతరం కృషి చేయాలన్నారు. ఇప్పటివరకు మండల పార్టీ అధ్యక్షులుగా పనిచేసిన వారి సేవలకు కృతజ్ఞతలు తెలియజేయడమే కాకుండా పాత, కొత్త నాయకులందరూ సమన్వయంతో పనిచేసి ఇటు ప్రభుత్వానికి, అటుపార్టీకి మంచి పేరు తీసుకురావాల న్నారు. త్వరలో సూపర్ సిక్స్ పథకాల అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో జూన్ 12వ తేది తల్లికి వందనం, ఆగస్టు నెలలో మహిళలకు ఉచిత బస్సు ప్రవేశపెట్టి నూతన పథకాలకు శ్రీకారం చుడుతున్నారన్నారు. ఇచ్చిన వాగ్దానాలను క్రమం తప్పకుండా నెరవేరుస్తూ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు సాగుతున్నారన్నారు. ఇటువంటి మంచి ప్రభుత్వానికి ప్రజల సహకారం ఉండాల న్నారు. ప్రస్తుతం ప్రతిపక్ష వైసీపీ కళ్లబొల్లి మాటలు చెబుతుందని, వాటిని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. మరోవైపు జాతీయ పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని , ఇది వైసీపీకి మంచి చేస్తుందని కోవూరు మాజీ ఎమ్మెల్యే చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.గతంలో ప్రధానమంత్రి మోడీని తిట్టిన ప్రసన్నకుమార్‌రెడ్డి ఇప్పుడు ఆయనను పొగడడంలో ఆంతర్యం ఏమిటన్నారు.ఒకవేళ ఆయన పార్టీ మారేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయన్నారు. దివంగత నేత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, బుచ్చి మున్సి పల్ చైర్మన్ మోర్ల సుప్రజ, జొన్నవాడ దేవ స్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ టి. అశోక్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కోదూరు కమలాకర్‌రెడ్డి, తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి , జోన్-1 కోఆర్డినేటర్ పెళ్లకూరు శ్రీనివా సులురెడ్డి జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి, దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, ఐదు మండలాలకు సంబంధించిన నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మండలపార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీపీ వై. రమణమ్మ, నేతలు అశోక్‌కుమార్, మధుసూదన్‌రావు, ఇంతా మల్లారెడ్డి, బాల రవి, ఎన్.వెంకట్, ఎం.సుధాకర్, వేగూరు సుబ్బానాయుడు, కె. శ్రీనివాసులు, సర్పంచ్‌లు కె.అమరావతి, వై. విజ యు,ఎంపీ టీసీ సభ్యులు నాగరాజు, సునీల్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌నాయుడు, వీరేంద్రనా యుడు, అమరేంద్రరెడ్డి, పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

## పురుషా మృగ వాహనంపైన శ్రీమల్లికార్జున స్వామి కామాక్షితాయి



**బుచ్చి మే 20 ప్రభాతవార్త** మండలంలోని పవిత్రపు ణ్యక్షేత్ర మైన జొన్నవాడలో కొలువైవున్న శ్రీమల్లికార్జునస్వామి కామాక్షి తాయి. ఆలయంలో జరుగుతున్న బ్రహ్మో త్స వాలలో భాగంగా అత్యంత వైభవంగా పురుషామృగవాహనోత్స వం వేడుకగా జరిగింది. పురుషామృ గవాహనానికి ఒక ప్రత్యే కత ఉంది. పర మేశ్వరుడికి అత్యంత పీతపాత్రమైనది మల్లికార్జునస్వామి వారికి కామాక్షితాయి ఇష్టమైనది పురుషామృగవాహ నం.పరమశివుడికి పురుషామృగుడు పరమభక్తుడు ఆయన హిమాలయాలలో తపస్సు చేసుకునేవాడు. ఆయన తలమాత్రమే మానవకారంలో ఉం టుంది. మిగిలిన శరీరం అంతా మృగం ఆకారంలో ఉంటుంది. ఆయ న తోకకున్న జుట్టు చాలా శక్తివంతమైనది. ఒకానొక సమ యంలో ధర్మ రాజు రాజసూయ యాగం చేసి వచ్చిన అతిథులం దరికి బంగారు పళ్ళెం లో భోజనం పెట్టాలని సంకల్పిస్తాడు. కానీ ఖజానాలో అంత ధనం ఉండ దు. ఆయన శ్రీకృష్ణుడ్ని ఎలా చేయాలని అడుగుతాడు. అప్పుడు శ్రీకృ ష్ణుడు ధర్మరాజుకి ఈ విధంగా చెప్పాడు. హిమాలయాల్లో పరమశివుని భక్తుడు పురుషామృగుడు ఉన్నాడని ఆయనకు లక్ష ఏనుగుల బలం ఉందని ఆయన వెనుక వైపు ఉన్న తోక వెంట్రుకలు తీసుకొని వస్తే అందరికీ బంగారు పళ్ళెంలో భోజనం వడ్డించవచ్చని చెబుతాడు. వెయ్యి ఏనుగుల బలం ఉన్న భీముడు హిమాలయాలకు వెళ్ళి పురుషామృగుడి వెంట్రుకలు దొంగిలించుకొని తీసుకొని వస్తుండగా పురుషామృగుడు ఆయనను తరు ముకుంటాడు. భీముడు రాజసూయ యాగం చేస్తున్న ప్రదేశానికి వచ్చి ఒక కాలు ద్వారం లోపల మరొక కాలు ద్వారం వెలుపల ఉంచిన వెంటనే పురుషామృగుడు ఆయనను పట్టుకుంటాడు. ధర్మరాజా నీ తమ్ము డు చేసిన తప్పుకు శిక్ష ఏమిటి? అని ప్రశ్నస్తాడు. వెంటనే ధర్మరాజు సగం బయట ఉన్న నా తమ్ముడి శరీరాన్ని తీసుకోమనిచెబుతాడు. ఆసమాధానానికి తృప్తి చెందిన పురుషామృగుడు ధర్మరాజా నీ సమాధా నానికి తృప్తి చెందా. నేను కూడా రాజసూయ యాగంలో సహకరిస్తానని చెబుతాడు. ఆ సమ యంలో శ్రీకృష్ణుడు పరమశివుని రూపంలో దర్శనమివ్వడంతో పురుషామృగుడు పరవశించి పో తాడు. ధర్మరాజు అందరికీ బంగారు పళ్ళెంలో భోజనం పెడుతాడు. అంతటి గొప్ప మహనీయుడు (పురుషా మృగుడు) వా హనం గ్రామోత్సవంలో గ్రామంలో తిరిగితే కరువుకా టకాలు పోయి ప్రజలందరూ సుభీక్షంగా ఉంటారన్నది పురాణ కథ. శ్రీమల్లికార్జున స్వామికి (పరమశివుడికి) శ్రీకామాక్షితాయికి (పార్వతీదేవికి) అత్యంత ప్రీతిపాత్ర మైన పురుషామృగ వాహనోత్సవం మంగళవారం కన్ను ల పండుగగా జరిగింది. ఈ కార్యక్రమా నికి ఉభయకర్తలుగా కీర్తిశేషులు వి.వి సుబ్రమణ్యం కుటుంబసభ్యులు (ఆత్మకూరు),వారణాసి వెంకట గంగా ప్రసాద్, అరుణాదేవి, ప్రధానర్చకులు వ్యవహారించారు. కార్యక్ర మంలను ఆలయ ఇఒ ఆర్వభూమి శ్రీని వాసులురెడ్డి , సేవా కమీటి చైర్మన్ తిరువూరు అశోక్‌రెడ్డి, కనపర్తి నాగేంద్ర,తిరువాయిపాటి నందకుమార్, ముంగర సుధాకర్, శ్రీశైల శశిశేఖర్‌శర్మ, పాలూరు చాముండేశ్వరీ, కొల్లపూడి శారద, పెన్నతూరు సుమలత, గంద్రకోట రమాదేవి, జొన్నలగడ్డ వరలక్ష్మీ, ఇమ్మడిశెట్టి సౌజన్యలక్ష్మీ పాల్గొన్నారు

## కావలి మందాడి చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే



**కావలి, మే 20 ప్రభాతవార్త** కావలి మున్సిపాలిటి పరిధిలోని ముసునూరు మందాడి చెరువును అధికారులతో కావలి ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. మందాడి చెరువు కట్టవద్ద ఏర్పాటుచేయ ను న్న వాకింగ్‌ట్రాక్, లైటింగ్, గ్రీనరి, తదితర ఏర్పాట్లకు సంబంధించి పలు అంశాలపై అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. మందాడి చెరువును అద్భుంతంగా తీర్చిదిద్దుతున్నట్లు, ప్రజలకు ఆహ్లాద వాతావరణాన్ని కల్పించేలా చర్యలు చేపడ తున్నట్లు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమీషనర్ శ్రావణ్‌కుమార్, మున్సిపల్ డిఈ సాయిరాం, టిడిపి లీగల్‌సెల్ కావలి నియోజకవర్గ కన్వీనర్ గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, కోటారెడ్డి, టిడిపి నేతలు పాల్గొన్నారు. ఆ సమయంలో వాకింగ్ చేస్తున్న మహిళలతో ఎమ్మెల్యే ముచ్చటించారు.